Scanned with CamScanner



తర్క వేదాంత విశారద

శ్రీ రమా చిత్రశాల

పండిత శ్రీ మొవ్వ శ్రీనివాస పెరుమాళ్ళు గారు

Scanned with CamScanner

శ్రీరామ.

శ్రీమతే రామానుజాయ నమః

శ్రీ వేంకటగురుభ్యో నమః

శ్రీ శ్రీనివాస గురుభ్యో నమః

శ్రీ విష్ణుదాస గురుభ్యో నమః

శ్రీ కృష్ణదాస గురుభ్యోనమః

శ్రీమతి పద్మాల

రామబాణమ్మ గారి గ్రంథం

ప్రాదివాక

3-5-2012.

శ్రీమతే రామానుజాయ నమః

శ్రీ శేషనగేశస్తవము

గోవింద సుందరపదాంబుజ మగ్నచిత్తో
మందాకినీ తులితమంజుల వాక్ప్రవృత్యా
లోకం సమస్త మకరోదవధూత పాపం
తంవేకటాఖ్య గురు మాత్మనిభావయామః

సంసారతాపానలదగ్ధభావా
స్సమాగతాయావవలోక్యసద్యః
భవంతి బోధామృతసేకహృష్టా
స్తామేగతి ర్వేంకటదేశికాంఘ్రీ.

మొవ్వ శ్రీనివాస పెరుమాళ్లు

Scanned with CamScanner

Scanned with CamScanner

శ్రీశోఽ వ్యాస్నః

పద్మావతీస్తుతిః

శ్రియై రమాయై హరిధర్మపత్న్యై
శుభప్రదాయై ధనధాన్యమూర్త్యై
నమః కృపాకాండధయేచమాత్రే
సమస్త లోకస్య నమో నమస్తే. 1

లోకేసర్వశుభ ప్రాప్త్యై
ని దానాని భవంతి యే
తే కటాక్షా స్సింధుకన్యే
దీయాసు ర్మంగళాని నః. 2

స్రష్టాప్యష్ట తనుస్త్రయీ తవరమే స్తోతుం విభూతిం మనాక్
ప్రారభ్యాంబ! పదాన్ ప్రసార్య విరతిం విందంతికృత్వానతిం
తాదృక్త్వద్గుణసంతతిం కవయితుం మన్యే ప్రయత్నాద్బుధై
ర్యాచ్యంభాష్య మనక్షరోనిగదితుం యత్నంగతో బాలిశః 3

మత్తః పరేస్రష్టృ ముఖాః ప్రకృష్టాః
స్తుతౌ సదృక్షాః ఖలుతే సరోజే
నద్యా విభాగో మహిమైవ భూమా
నహోఽబ్ధిమధ్యే పరిదృశ్యతేకిమ్. 4

యేషాం మూర్తిషు పంకజే! తవసుధాసందోహనిష్యంది స
మ్మోదాపాదక మందసుందర కటాక్షస్స్యందతే సంతతమ్
తే తిష్ఠంతి సురేభ భద్రకరి గోజాత్యశ్వసంఘైర్యుతా
స్సౌవర్ణాగ్ర మహాగృహాః జననితాన్ వక్తుం సమర్థోఽస్తికః 5

త్వదీయకారుణ్య సుధాసముద్రే
లవంనరో యోలభతే సరోజే!
సరాజరాజా దధికోధనాఢ్యః
గృహాంనగణ్యాన్ భువమేత్యపారామ్. 6

యోవిందతే తే భువికింకరత్వం
నయాతిలోకేషు స కింకరత్వం
స కింకరో గంధగజేంద్రయానః
విరాజతే దేవి! నచిత్రమేత్. 7

త్వత్పాద పద్మాశ్రయ దృప్తచిత్తా
అన్యాన్ సురాన్ కామ ముపాసతేకిమ్
మన్దార మాధ్వీరసమగ్న భృంగాః
కాంక్షంతి కిం నీరస కుట్మలాని. 8

దారిద్ర్య తాపాది నివారకం తే
పాదాంబుజం స్తౌమి నతేన మూర్ధ్నా
శిరీష పుష్పాధిక కోమలం త
న్నస్తౌతి యస్తోత్ర విశేషవేదీ. 9

నృత్యంతః పరితశ్చరంతి కమలే గంధర్వసంఘాః క్వచిత్
గేయధ్యాన జడీకృతాఖిల రవాస్తిష్ఠంతి రంభాదయః
కుంఠీభూత పరాక్రమోత్తమ పదాస్సేవంత ఏవామరాః
దృక్పాతోయముపైతి సుందరగృహేతేతస్య కారుణ్యయుక్. 10

భౌమాదిదుష్ట గ్రహసంతతిర్మే
స్యాదష్టమే దుష్టలిపిర్విధాతుః
దయామయిస్యాత్ హృదిసర్వమంబ
యథాంధకారో మిహిరోపకంఠే. 11

Scanned with CamScanner

ధనీచ భోగీచ నరత్తమస్సః
ప్రభుస్సమాఖ్యాతయశాః కులీనః
మహాకవిస్స్రశ్శ్శృతి సారవేదీ
యస్యోపరిస్యాత్తవ దృక్ప్రపాతః. 12

తవాశ్రయస్తిష్ఠతి యస్యమాతః
నవిద్యతేతస్య వివేచనం యతః
విహాయభూమౌ. పురమబ్ధిమధ్యే
చకారనాథస్తవ శేషశాయీ. 13

జగన్నివాసోఽపిత్వయారమే వినా
నవిద్యతేజాతు భువిప్రకామమ్
అహోనృసింహస్తరసాఽఽగతస్తదా
దృష్ట్వానచత్వాలంలఘు విక్రమోగతః 14

శ్రుత్వాదేవగణార్ధనాం భువమిమాంప్రాప్య స్థితోదండకే
క్రీడన్మౌని వరైశ్చతుర్దశ సమానాగచ్ఛదబ్దేస్సుతే
లంకాంపంకజలోచనస్త్వయి గతాయామంబ శాఖామృగై
ర్వ్యక్తస్తత్రగతోరమే విచరతిస్వామీచ నత్వాంవినా. 15

రాత్రౌరూక్షదృశా నిశాచరయుతాం లంకామపశ్య స్తదా
కల్యేసావిగతోత్సవా గతశుభా భస్మీకృతాఽభూత్తథా
త్వాంనిందావచనై ర్ముఖాముఖిరమే! కృత్వాపరాధాం కథం
జీవంస్తిష్ఠతి రావణ స్తవగుణా ద్వాత్సల్యరూపాత్ఖలు. 16

రక్షాసదృక్షం జగదంబకర్తుం
లోకం సమస్తం లఘులీలయాత్వం
దక్షాఽపిరక్షోధిపగేహకుక్షే
రుదంత్యహో తిష్ఠసిపాకృతేవ. 17

Scanned with CamScanner

తపఃకృతం దాన మపిప్రభూతం
నయోగముద్రాదిక మంబకించిత్
ద్విజోవనే తుభ్యమసూన్విముక్త్వా
త్రిపాద్విభూతిం సులభాంచలేభే.

లబ్ధ్వాముదంతే జనకస్సరోజే
తవ ప్రకృష్టాజ్జనుషః పయోబ్ధిః 18
అస్వప్నసంఘాయ ది దేశరత్న
ప్రసిద్ధపీయూష తురంగమేభాన్.

ఉద్దిశ్య, త్వత్పాద పదాంబు జంయో
నమస్కరోత్యంబ దదాసితస్మై 19
ఆనందలోకా నిహలోకభోగా
నుదారతాంతే కీమిమాం ఫణామః

20

శ్రీ వేంకట పరబ్రహ్మణేనమః

శ్రీ శేషనగేశస్తవము

ప్రథమాశ్వాసము

శా. శ్రీలక్ష్మీరమణీ మనోహర! జనశ్రేయః ప్రదప్రస్ఫుర
న్నీలాభ్రప్రతిమానదేహ! త్రిజగన్నిర్మాణదక్షప్రభూ!
ప్రాలేయాంశుసమానవక్త్ర నిగమారాధ్య స్రవంతీజనీ
మూలాంఘ్ర్యబ్జ! భవాబ్ధితారణకృతీభోగీంద్రగోత్రాధిపా! 1

మ. రసయున్ బర్వతముల్ నభంబు పవనుల్ రవ్యాదిఖస్థంబులున్
ససురానీకములైన లోకములు నా శర్వాది దిక్పాలకుల్
ప్రసదంబుల్ నశియించినంతవటపత్రంబందునన్వేడ్కతో
బసిబాలుండవు పోలెనుందు, వుదధిన్ బద్మావతీ నాయకా! 2

మ. వటపత్రంబున యోగనిద్ర, యుగముల్ వర్తించియామీఁద స
త్పటిమన్ ధాతనునాభిపద్మమున నుత్పాదించి యాధాతచేఁ
బటు లోకంబుల సృష్టిఁజేసి యొరిమంబాలింతు వెల్లప్పుడీ
విటుగావించుట క్రీడలంచు మదిలోనెంతున్ భుజంగాద్రిపా! 3

ఉ. మానవులాప్తులై గొలువ, మాధవ! వారల పాపసంఘముల్
కానలనెల్ల నగ్నివగఁగాల్చి శుభంబులఁగూర్చి వారికిన్
మానసవాంఛితార్థములు మానకయిచ్చుచునుందు వెప్పుడా
మానిత వేంకటాద్రి నసమాన విధంబుగ వేంకటేశ్వరా! 4

ఉ. ఆదిమునీశ్వరుల్ శ్రుతులు యాగభుజుల్ గొనియాడఁజూచినీ
పాదసరోజయుగ్మముల బంధురసంస్తుతిఁజేయఁబూనితిన్
ఖేదములేక వారినిధి కేసరిసూనుఁడుదాఁటెనంచు దా
మోదము తోడనొక్క కపిపూనినతేవ వృషాచలేశ్వరా! 5

Scanned with CamScanner

ఉ. భావముఁజూచి బ్రోచెదవు పాండితిరూపము భోగసంపదల్
పావన యజ్ఞకర్మములు ధర్మగృహంబులఁ జూడవెప్పుడున్
భూవరులన్ ద్విజాతులను భూరిధనాధికులం దృజించి నీ
సేవకుఁడైన యావిదురుచెంతకు నేగవె వేంకటేశ్వరా! 6

ఉ. అంగము లేవిలేక ప్రళయాంబుధి భంగములందు దీనులై
సంగతిలేకయున్న యల జంతుసమూహముఁజూచి వారలన్
మంగళదేహయుక్తులుగ మానవకోటిగఁ జేయు దీవె యీ
వెంగలు లీయుదంతమును వీసమెఱుంగరు వేంకటేశ్వరా! 7

క. నారముల నీవుదాల్చుట
నారంబులఁ గల్పమందు నయముగనుంటన్
నారమును నీవు బూనుట
నారాయణుఁడంద్రు నిన్ను నాగాద్రిపతీ! 8

చ. వర కమలాసనాది సురవర్గములన్ గగనాదులన్ ధరా
ధరముల నర్ణవంబులను దారకలన్ బహు జీవరాసులన్
విరివిగఁ జేసినట్టి బలువేత్తవు కర్తవునీవుగాక యిం
కొరుఁడు గలండె లోకమున నోభుజగేంద్ర మహీధ్రనాయకా! 9

శా. ఏలోకంబున నెవ్వఁడేమిపనికై యేరీతి వాపోవునో
యేలీలన్ విహరించు విష్ణువిపుడేడీ చూపుఁడంచున్ ఖలుల్
దూలం బల్కుదురెట్లొ సజ్జనుల సాధువ్రాతమున్ వారినె
ట్లాలోకింతువొ? యెందునుండి? భుజగేంద్రాద్రిప్రభూ! శ్రీహరీ! 10

ఉ. ఎన్నియుగాలకైన భువినెవ్వరికైనను గోచరింపవో
పన్నగ తల్పశాయి! మము బాలిశులంచును జూతువో! కటా
యెన్నగ నీస్వభావ మదియేమొ శరీరుల పాపకర్మమో
యిన్నుడిఁదెల్పవయ్య యురగేంద్రమహీధ్ర శిరోవిభూషణా! 11

Scanned with CamScanner

ఉ. నీకొఱకేమియత్నము మనీషఁదలంపని వానికి న్నినున్
వాకొనకుండువానికిని పాపవిచింతనులైనవారికిన్
జేకొని కర్మకుందగిని జీతములెప్పుడు నిచ్చుచుందు వీ
వో కమలాప్త! నీదయకు నుండునె పారము? వేంకటేశ్వరా! 12

ఉ. జంతుఫలప్రకాండమున సస్యసమూహమువోలెనున్న యీ
యంతములేని కాండభవజాండకులంబును నెట్లు మూర్తియం
దంతముగాక బ్రోచెదవొ యన్నిటి నెప్పుడునట్టి నీ బలం
బెంతని సన్నుతింతు? నురగేంద్రమహీధ్రశిరోఒగ్రభూషణా! 13

చ. అధికగభీరమై వెలయు నంబుధిఁ బత్తనపం క్తిఁగూర్తువా
కుధరయుతాబ్ధిమేఖలను గూర్మిసరిత్పతిఁజేయుదట్లె స
ద్బుధులను బామరాళిగను మూర్ఖుల ధీరులఁగాగఁజేయు నీ
ప్రథితమహత్త్వమెంతయని? పల్కుదుమయ్య! వృషాచలేశ్వరా! 14

చ. ధరణిని సర్వసస్యసముదాయినిఁజేసి వలాహకాళిచే
సరియగు నీరమిచ్చి బలుసారములైన నదీప్రవాహముల్
విరివిగఁగల్గఁజేసితివి ప్రీతిఁగరంబు నెవండొసంగె నీ
కరుణయగాదె! యింతపనిఁ గల్పనఁజేసె! వృషాచలేశ్వరా! 15

ఉ. భిక్షువుచేతఁ గొట్టబడి భిన్నశిరంబగు కుర్కురంబు నీ
పక్షముఁజేరి పాహి యనివాకొన దానినఁబ్రోచి బాడబున్
శిక్షితుఁజేసినావు నరశేఖరు లెవ్వరునేర్తురీవగన్?
రక్షణ నీకె చెల్లుఁ గరుణామయ! శేషమహీధ్రనాయకా! 16

చ. అడవుల బాములొందు మిహిరాత్మజుఁజేకొనివానికున్న ఆ
యిడుములఁ బారఁద్రోలి ప్లవవగేశ్వరుఁజేసి మహావిభూతియున్
బడఁతుల బల్విలాసముల బంధులనిచ్చియుఁ బారతంత్ర్యమున్
గడువడిఁదాల్చి పల్కితివి కారణమేమి? వృషాచలేశ్వరా! 17

Scanned with CamScanner

చ. అడుకు లొసంగినట్టి యచలామరు వేడుక నాదరించి యా
మృడధనదాది దేవతలమించు ధనంబును భోగరాశియున్
బుడమినొసంగి కింకరతఁ బూనగఁ జూచితివయ్య! యెప్పుడీ
నడవడియున్ దయారసము నైజము నీకు వృషాచలేశ్వరా! 18

మ. పురుషుండెవ్వఁడు నీ కృపారసములోఁ బొల్పొందునో! వానికే
కరులున్ ఘోటకముల్ క్రమేళకములున్ గాంగేయవారంబులున్
వరణంబుల్ ఘనసౌధరాజవనముల్ పద్మాకరంబుల్ మణుల్
ధరణింగల్గును వానిఁజెప్పవశమే? దర్వీకరాద్రిప్రభూ! 19

ఉ. ఫాలమునందుఁ గంజజుఁడు బాములనొందఁగ వ్రాయనిమ్ము త
త్కాలకుజాదు లుద్ధతిని గష్టదశల్ పచరింపనిమ్ము నీ
మేలికటాక్ష మీ నరులమీఁదను సోఁకిన నేమిసేయు? వా
తూలవిధూతతూలములతో సరిగాదె! వృషాచలేశ్వరా! 20

మ. అపచారంబొగిఁజేసి నీకు, ఖలుఁడై యా బ్రహ్మలోకాదులన్
జపలత్వంబున సంచరించి ఫలమున్ సాధింపఁగాలేక నీ
దుపదంబే శరణంబటంచు మహిపై దుఃఖంబుతో వ్రాలఁగాఁ
గృపచేఁ గాచితివయ్య! వాయసము భోగిక్ష్మాధరేంద్రప్రభూ! 21

ఉ. పావనమూర్తి నీకృపకుఁ బాత్రముఁగాని శరీరపాళికిన్
లేవుసుఖాదులున్ ధనములేదు శుభంబులులేవు ధాన్యముల్
లేవు సమస్తవిద్యలునులేవు యశంబులు భోగసంతతుల్
లేవు త్రిపాద్విభూతియును లేదు, ఫణీంద్రమహీధ్రనాయకా! 22

ఉ. ఆగమ మప్రమాణమని యాడిరికొందఱు భైక్షవృత్తిచే
వే గమనించువాని నిల విశ్వవిభుండని పల్కిరీజగ
ద్భాగము కర్తృహీనమని పంతములాడిరి కొందఱిట్టి బై
రాగులమీఁద నీదుకృప రాదుగదా! యహిగోత్రనాయకా! 23

Scanned with CamScanner

శా. కుంభీరప్రతిబధ్యమానమగు నాకుంభీంద్రమత్యార్తితో
నంభోజాకరమధ్యమందు నుతిసేయన్ దానిఁగాఁపాడ సం
రంభంబొప్పఁగ వచ్చితీ వజ్రబలారాతుల్ నుతుల్ సేయఁగా
సంభావింప కనుగ్రహంబిదియెపో! సర్వేంద్ర గోత్రాధిపా! 24

చ. శరణమటంచు వచ్చితిని సర్వశరణ్యుని రాముఁగోరి నేఁ
దరుచరులారయంచు నిటు తందరనొందక పల్కినట్టి యా
శరవరుఁబ్రేమతోఁ బిలిచి సౌఖ్యపదంబొడఁగూడ నిచ్చితౌ
కరమనురక్తిగాదె యిది? కాకపిచండవరాద్రినాయకా! 25

సీ. సౌధంబులను రాజ, సంస్త్యాయముల మించి,
గట్టఁగఁ బనివాళ్ళఁ బెట్టుచుండు
రొక్కంబు లెక్కింపఁ, బెక్కు భృత్యులనుంచి
కట్టుదిట్టముఁజేసి, గాచుచుండుఁ
బండిన ధాన్యంబు, పాతళ్ళనిండ్లను,
బట్టించి సంతోషపడుచునుండు
వ్యాపారములమీఁద, వచ్చెడు ధనమును
వడ్డీలకై వేతె, యొడ్డుచుండు,

తే. నెవనియందును నీదయయింతయైనఁ
బడునొ వానికి నిట్లుండుఁ బట్టరాదు
గాని నీకృప యిదియంచుఁ గానలేఁడు
శేషనగవాస! పద్మేశ! శ్రీనివాస! 26

సీ. విరివిగాఁ దోలితి, నెరువు నేఁజేనిలో,
దున్నుటలో లోప, మొన్నలేదు,
నీరుబెట్టుటలోన, నేర్పరి నేనుగా,
కొరుఁడొకండుగలండె? యూరిలోన

Scanned with CamScanner

నారు బెంచుటలోన, నాకున్న విఖ్యాతి
పురజనులందఱుఁ బొగడుచుంద్రు
ఇన్నికారణముల, నింతటి ధాన్యంబు
పండెగా లేకున్నఁ బండునెట్టు

తే. లని తలంచునుగాని యీ, యవనియందు,
మనుజుఁ డిదియెల్ల నీమహిమంబె యనుచు
విశ్వసింపఁగలేఁ డవివేకి యగుట
విగతభవపాశ! తిరుమల వేంకటేశ! 27

సీ. సాధుల బీదల, వేధించి శిక్షించుఁ
దిరిపెమెత్తెడివారి, ధిక్కరించు
యాచకబృందంబు, నతిరోషమునఁజూచి,
దర్పంబుతో వారిఁదఱిమివైచు
సంగవిహీనుల, నవహేళనమొనర్చి
వెక్కిరించుచు వారి, వెడలఁగొట్టు,
గాందిశీకులఁ గాంచి, కర్మముల్ చేయక
తివిరివచ్చిరటంచు, దిట్టుచుండు

తే. సాగినప్పుడు మనుజుండు, సర్వకర్త
వీవుగల వొండు శిక్షింతు, వెపుడొ యనుచుఁ
బూని తలఁపఁడు భువిలోన, మూర్ఖుఁడగుట
దందశూకధరేశ! పద్మాహృదీశ! 28

సీ. అర్ధశరీరిణియగు భార్యకైనను,
లోభియై డబ్బీయ, లోఁగుచుండుఁ
దన కుటుంబములోనఁ దనరువారినిఁగూడ
దిననీక సతతంబుఁ దిట్టుచుండు

Scanned with CamScanner

భృత్యవర్గంబులు, భృతికినైయాచింప,
తేఁపు మాఁపని వారి, నాపుచుండుఁ
గూలికై కూలీలు, గోలఁజేయఁగఁ జాల
పిచ్చిమానికలచే, నిచ్చుచుండు

తే. వాఁడు దినక ధనంబును, గూడఁబెట్టుఁ,
గాని యెఱుగఁడు తన్నాశ, కారకుఁడవు
నీవు గలవని ధనమును నీదెయనుచు
విశ్వలోకేశ! తిరుమల వేంకటేశ! 29

సీ. నవఖండముల నేలు, నాయకుఁడొకవేళ,
భృతికినై బహువిధ, గతుల నెమకు
పుణ్యజనేశ్వరుఁ బోలిన ధనికుండు,
చివుకకై యొకని యాఁ, చింపఁగడఁగు
సౌందర్యవతులైన, మందయానలగూడి
యుండువాఁడలమట బెండువడును
వివిధభోగంబుల, విఱ్ఱవీఁగెడువాఁడు
తిండికై యూరూరఁ దిరుగుచుండు

తే. వీర లీవిధి నగుటకు కారణంబు
లోకనాయక! నీ దయాలోకనంబు
దానిలేమియు ననినేను, దలఁతునయ్య
విగతభవపాశ! తిరుమల వేంకటేశ! 30

సీ. హాటక మయమగు, హరిపీఠమందునఁ,
దేజరిల్లు నొకండు, దిశలువెలుఁగ
నతని కారుణ్యమే, యన్నియుఁ దనకని
వింజామరలచేత, విసరు నొకఁడు

యాప్యమానంబెక్కి, యధికమౌ ఠీవితోఁ
బోవుచుండు నొకండు, పొలుపుమిగుల
నతని యాందోళిక, నంసభాగంబునఁ
బెట్టి ముదంబునఁ బ్రేలు నొకఁడు

తే. లేదు పుట్టుకభేదంబు, లేశమైన
కారణము వీరి, కారయ, కంజనేత్ర!
నీ దయాప్రాప్తిఁగనుటయే నిక్కమయ్య
శేషనగవాస! పద్మేశ! శ్రీనివాస! 31

సీ. వల్మీకసంతతుల్, వపువు నాచ్ఛాదింపఁ
దపముఁ జేసినయట్టి తాపసులును
బంచాగ్నిమధ్యమం, దంచితంబుగనుండి,
ధ్యానముల్ గావించు ధన్యమతులు
శాఖావలంబిత, చరణులై యోగాప్తి
బహుళంబుగా నొందు భవ్యయశులు
ఆర్ద్రాంబరంబుల, నధిగమించి, యనేక
వర్షముల్ చింతించు, వరగుణాఢ్యు

తే. లధికమగుభక్తి నినుగాంచి, యడవియందు
నీదు కారుణ్యమును బొంది, నిఖిలమైన
కృచ్ఛ్రముల వీడి తులనేని కీర్తిఁగనిరి
విగతభవపాశ! తిరుమల వేంకటేశ! 32

సీ. వ్యాకృతులెల్లను, వల్లించి నుతిఁగన్న
వాయుజుఁడుండఁడే వనములందు
నఖిలప్రపంచంబు నరసిచూచినయట్టి
యర్కజుఁడొందఁడే, యధిక భయము

విధికిమాఱుగసృష్టి, వేడుకఁజేసిన,
సంయమి బొందెనే, సవనఫలము?
సర్వలోకంబుల, సాధింపఁగలపాండు
తనయులు తమపాలుగొనగలిగిరె?

తే. లోకనాయక! నీ దయాలోకనంబు
కలుగునందాఁక బహువిధగతులఁజూడఁ
బ్రాణులకునెల్ల నీకృప, భద్రదమ్ము
దండశూకధరేశ! పద్మాహృదీశ! 33

సీ. అఖిలేశ! నినుగొల్వ, కా, హరిశ్చంద్రుండు,
సత్యవంతుండయ్యు శ్వపచుఁగొలిచె
జలజాక్ష! నినుఁగొల్వఁ, జాలక నహుషుండు
శతయజ్ఞకర్తయై సర్పమాయె
శ్రీశ! నీపదముల, సేవింపక నృగుండు,
సలిపి గోదానముల్, సరటమాయె
హరి నిన్నుఁగొనియాడ, కావృకదైత్యుండు
భవ్యయోగముఁబూని, భస్మమాయె

తే. స్వర్ణదానముఁజేసిన, కర్ణుఁడెలమి
నన్నహీనతఁబడియె, నాయాజియందుఁ
బుణ్యములకెల్ల నీదయ, మూలమయ్య
విగతభవపాశ! తిరుమల, వేంకటేశ! 34

మ. తపముల్ దానములున్ మఖంబులు
మహాధర్మంబులున్ యోగముల్
జపముల్ తీర్థములున్ ద్రయీపఠనముల్
సంధ్యాగ్ని కర్మంబు లా

Scanned with CamScanner

యుపవాసంబులు శౌచశీల
దమసత్యోక్తుల్ సుధీస్తుత్య! నీ
కృపకున్ సామ్యముగావు సర్వక్రియలున్
గీర్తింప శేషాద్రిపా! 35

ఉ. శ్వేతుఁడు తొల్లి యా విపినసీమనుజేసి తపంబు ధీరుఁడై
వీతకళంకుఁడై వపువువీడి విరించను డాసి క్రమ్మఱన్
బ్రేత శరీరమున్ దినియెఁ బెక్కు శరత్తులు భూమి నీపదా
బ్జాతముఁ గొల్వనేరక భుజంగవరాద్రిశిరోభూషణా! 36

మ. అపరాధంబులు పెక్కుజేసి కలుషవ్యాపారులైయుండి నీ
దు పదంబుల్ మదినెంచియొక్కపరియుద్ఘోషింపబల్ ప్రేమతో
సుపథంబిత్తువు పాపసంఘముల సంశోధించు విజ్ఞానమే
విపులంబొందదా? నీకు వృత్తియిదియో? విశ్వేశ! శేషాద్రిపా! 37

ఉ. భోగులు జోగులయ్యెదరు పోడిమిగల్గిన రాగులెల్ల బై
రాగుల మైత్రిఁ బొందెదరు రాజులు గొప్పతరాజులై ధరన్
వేగమ చూడనొప్పెదరు విశ్వజగద్ధిత నీపదాబ్జముల్
వే గనలేని మానవులు, వేంకటనామ శిలోచ్చయాధిపా! 38

సీ. గడియకుఁ బద్యముల్, క్రమముగఁ జెప్పుచు,
నవధానమునుజేయు, నధికశక్తి
కఠినంబులైన యుద్గ్రంథంబులకు నెల్లఁ,
జెలఁగి వ్యాఖ్యానంబుఁ జేయుచుండు
తర్కాదిశాస్త్రసూత్రంబులకెల్లను,
భాష్యముల్ గావించి, ప్రబలఁజేయు
నాగమంబులకెల్ల, నర్థంబు వివరించి,
సభలఁ బ్రసంగంబు, సలుపుచుండు

Scanned with CamScanner

తే. నంబుజోదర! నీ కరుణామృతాబ్ధి,
నోలలాడిన మనుజుండు బాళిమీఱ,
ధరణియందున నాతనిc, దలcపవశమె?
విగతభవపాశ! తిరుమల వేంకటేశ! 39

సీ. అఆలు మొదలగు నక్షరంబుల దిద్ది,
వత్సరంబునకైన, వ్రాయలేcడు
రామశబ్దము పెక్కు, రాత్రులు దివములు,
వల్లించినను రాక, వదలుచుండుc
బద్యంబుcజెప్పిన, బఠియించి పఠియించి,
రాదు, నాకిదియంచు, వాదులాడు
వచ్చిన పద్యంబు, వల్లింపుమన్నచో,
మఱచిపోయితినంచు, మరలిపోవు

తే. నెంతకాలంబు జదివిన, సుంతయైన,
రాదు వానికి నీదయ, లేదుగాన,
జ్ఞానములకెల్ల, కృపయె, నిదాన మరయ,
విగతభవపాశ! తిరుమల వేంకటేశ! 40

చ. పురహర దేవనాథ విధిపూజ్యపదాబ్జుcడవైన నీవు నాc
డరమరలేక యుద్ధమున నర్జునుగావcగ బూనిగాదె య
య్యరదముc ద్రోలినావు సుజనావన! నీకిది చెల్లునయ్య? సు
స్థిరమగు నీదయామహిమcజెప్ప నశక్యము వేంకటేశ్వరా! 41

చ. అనిశము బ్రోచు నిన్మఱచి యజ్ఞులు కొందరు దేవదీర్ఘికా
వనమును ద్రోసి చౌటిపడె వారిని దాహనివృత్తికై కటా!
మనములcగోరుతేవ శతమన్యు విధాతృశివాద్యమర్త్యులన్
గొనకొని గొల్తురల్పులయి కుండలిరాజమహీంధ్రనాయకా! 42

Scanned with CamScanner

ఉ. దేవ! భవత్ప్రభావజలధి స్ఫురదంచిత సూక్ష్మలేశమున్
భావమునందుఁ గన్ననరపాళి యొకానొక దేవమాత్రునిన్
సేవితుఁజేయునే ఘనుఁడు చిత్రకరుండు వెలుంగదీప్తికై
దీవియఁబట్టునే? ధరణిఁదేరకు శేషమహీంధ్రనాయకా! 43

చ. మలినపదార్థజాతములు మండెడుపావకుఁజెంది భస్మమై
కలుషముఁబాయుచందమునఁ గల్మషవృత్తిఁ జరించుచున్ననో
జలధరదేహ! నీచరణసారముల్ మదిఁగోరి కొల్చు వా
రలు, సుజనాగ్రగణ్యులయి రంజిలుచుందురు వేంకటేశ్వరా! 44

సీ. తపనీయచేలంబు, ధరియించునట్టి నీ,
వరయ వల్కముఁగట్టి, తిరిగినావె?
సింహాసనంబునఁ జెలువొందునట్టి నీ,
వజినాసనమునందు, నలరినావె?
దివ్యశయ్యలయందుఁ దేజరిల్లెడు నీవు,
గండశైలంబులఁ బండినావె?
భవ్యాన్నపానముల్, భక్షించునట్టి నీ,
వకట! దుంపలు కాయ, లానినావె.

తే. దండకాఖ్యవనంబున, నుండునపుడు,
కారణంబేమినీకిది? కంజనేత్ర!
దాసరక్షణమాత్మలోఁ దలచికాదె,
విగతభవపాశ! తిరుమల వేంకటేశ! 45

సీ. పుష్కరపథచుంబి, పుష్కరభంగముల్,
పంకయుక్తంబులై, భంగమొందె
తత శుక్తివిద్రుమ, తారమాణిక్యముల్,
కాంతివిహీనత, గసటునొందె

నత్యుచ్ఛ్రితంబులౌ, నద్రిసంఘంబు, చ
టచ్చటధ్వనితోఁ బటపటఁబగిలె
నక్రకూర్మగ్రాహ, నాగసంతానముల్
బోరుననార్తిచే, బ్రోయఁదొడఁగె

తే. నుదధిపై నీవు కోపంబు నూనువేళ,
కంధినాయకుఁ దల్లాడి, గాదె నీకు,
గానిపించి నుతించె నోదీనరక్ష!
విశ్వలోకేశ! తిరుమల వేంకటేశ! 46

సీ. ప్రాగ్ధరాగ్రస్థిత, ప్రబల రక్తోదీర్ణ,
తరణిబింబముఁ జాలఁ, బరిహసించి,
భువనావసాన సంభూత సంకర్షణ,
కీలికాజాలంబుఁ, గేలిచేసి
ప్రళయసముద్భూత, వారిద సంజాత,
చంచలాలోకంబు, కుంచిమిగుల
సకలజగచ్ఛేద, సంవర్థితారుణ
సూనుకోపంబును, సున్నజేసి

తే. కానిపించెను గాదె, లంకాధినాథు
కంఠపంక్తిని, దున్మాడు, కాలమందు,
వానరాళికి నీదివ్య, వదనదీప్తి,
దందశూకధరేశ! పద్మాహృదీశ! 47

సీ. తిర్యక్కులై కోన, ద్రిమ్మరీఁడులచేత,
మించు గాఢాలు, మోయించినావు
కులశైలములనెల్లఁ, గురియించి విరివిగా
జలములపై వాని, నిలిపినావు

కడుదీర్ఘమై చాల, గంభీరమై యొప్పు
కంధినాయకు గట్ట, గట్టినావు
ప్రధనరంగంబున;ఁబడిన వానరులను,
బ్రాణములిచ్చి, కాఁపాడినావు

తే. పెక్కుదుష్కరకృత్యముల్, విశ్వమందుఁ
జేసి పలికితి వానాఁడు, చిత్రమిదియ
యాజికిన్ బుత్రకుండ నేనంచు నీవు
విగతభవపాశ! తిరుమల వేంకటేశ! 48

చం. మనుజుఁడనంచుఁ బల్కెదవు మస్కరియాగముఁగాచి దైత్యులం
దునిమిసుబాహునగ్రజుని దుష్టునిఁ జంపవు బల్మిలేకయా?
మనమునినీ బృహత్కథకు మార్గము వీఁడని యెంచియా? మముం
జనములఁగాఁగఁజూచి యిదిసత్యముఁ బల్కుము వేంకటేశ్వరా! 49

మ. ప్రమదాస్త్రంబున మూడులోకముల కాపాదింతు నాశంబునేఁ
డమరుల్ చుల్కనజూచి రీవగసగర్భ్యాయంచు మాట్లాడు నీ
వ మనంబందు నెఱుంగలేవె? కుహనావాతాయురూపంబటం
చు, మిమున్ వంచన సేయవచ్చె నిదియంచున్ శేషగోత్రాధిపా! 50

ఉ. ఉత్తముఁడౌ పతంగవిభు నూర్ధ్వజగత్తున కంపినట్టి నీ
కత్తరి శక్రపుత్ర మిహిరాత్మజులందున భేదమేవగం
బొత్తుగఁదోఁపదయ్యె రఘుపుంగవ! నీకిపు డెట్లువచ్చునో
తత్తరపాటు నజ్ఞతయు తార్క్ష్యతురంగమ! వేంకటేశ్వరా! 51

శా. అంగుష్ఠాగ్రముచే హరింతు నిఖిలాజాండంబులన్ లేక భ్రూ
భంగంబే సకలార్థసాధనముపో బ్రధ్నాత్మజా యంటివే
భంగోపేత జలాధినాథునుతికై బద్ధాసనస్థుండవై
భంగంబొందితివయ్యా! కారణము వే భాషింపు శేషాద్రిపా! 52

Scanned with CamScanner

మ. తృణఖండంబున వాయసంబును మహాదీనత్వమొందించి దృ
క్కణమున్ దీపి పరిత్యజించిన నినుం గాకోదరాస్త్రంబులన్
రణభూమిం బడవైచెనే? యహహా! యారక్షఃకుమారుండు నీ
పణితక్షాంతి గుణంబెగాదె తలపం బంధించె శేషాద్రిపా! 53

చ. తెలియనివాని తేవఁ బలుతెన్నులఁ బల్కెద వీవుగాని యా
బలులగు వానరాధిపుల బంపుచు దిక్కుల కేరికీయకా
వలకడకేగు వాయుసుతు పాణినిబెట్టితి వంగుళీయకం
బలఘు గుణాబ్ధి! దోఁచె నెటులక్కజమయ్యె! వృషాచలేశ్వరా! 54

మ. రవి వంశమునంబున బుట్టినట్టి జనుఁడన్ రాముండ నేనంచుయా
భవకంజోద్భవ దేవతావరులతో భాషించినట్టీవు దు
ర్భవమునంబాపి పరంబొసంగితిగదా! ప్రాప్తించితత్పుణ్యమున్
భువిపుణ్యాత్మకుఁడైన మౌనికెటులో భోగీంద్రగోత్రాధిపా! 55

మ. పలువర్షంబుల కీవువత్తువని యాబ్రహ్మర్షి రాజర్షి సి
ద్ధులు విద్యాధరులా భుజంగులు మునీంద్రుల్ దేవతానాయకుల్
పలుకంజొచ్చిరిగాదె లోకసమితింబాటించి ధర్మస్థితిన్
నిలువంబెట్టఁగ దుష్టశిక్ష కొఱకై నిత్యంబు శేషాద్రిపా! 56

ఉ. కోసలరాజ్యమున్విడిచి కూరిమిదండకకేగ నీవు బ
ల్యాసిదొలంగె వృక్షములు పక్షులు ఖిన్నతనొందె భూతముల్
బాసె సుఖంబులన్ హృదయపద్మనివాసుఁడవౌటచేఁగదా
భాసితపాదపద్మ! నవపంకజనేత్ర! వృషాచలేశ్వరా! 57

చం. జలజభవాండభాండము లజస్రము నేలెడు నీవు బిడ్డవై
మెలఁగుచు ముద్దుఁజూపుచును మేలగుపల్కులఁ బల్కుచుండనా
సలిలజమిత్రవంశజుఁడు సన్మతి నెంతగసంతసించెనో?
యలవియె జెప్ప మానవుల? కాగమవేద్య వృషాచలేశ్వరా! 58

Scanned with CamScanner

మ. శరదిందు ప్రతిమానమై సుఖదమై శక్రోపలశ్యామసుం
దరమై కోమలమై పయోజనిభమై తారుణ్యసంపన్నమై
దరహాసాన్వితమైన నీవదనమున్ దల్లుల్ నిరీక్షించి యే
సరణిన్ మోదమునందిరోగద! భువిన్ సర్వేంద్రగోత్రాధిపా! 59

ఉ. గ్రామమువీడి నీవు వడిఁ గానకునేగఁగ నార్తిచే జనుల్
సేమముఁబాసి నీవెనుకఁ జెచ్చెరనేగిరి చోద్యమయ్యెడున్
భూమిపుఁడంచుఁబోదురె నినున్ హరివంచు నెఱుంగకున్న? నిం
కీమహి వెంటనంటిరి పరేశుఁడవౌట వృషాచలేశ్వరా! 60

ఉ. పాయక వేయివర్షములు పద్మజుఁగూర్చి తపంబుఁజేసి గా
ధేయుఁడు నిన్నుఁగాంచి కడుదృప్తివహించి స్తుతించె నిన్ను గా
కాయమరేశునైనఁ గొనియాడునె? యీజగదంతరాత్మవౌ
ధ్యేయమవంచుగాదె! మునిదీపక! శేషనగాధిపాలనా! 61

చ. విపినముఁజేరబోవు నిను వేడుకఁజూడఁగ వచ్చిరయ్యెడన్
దపములఁ బేర్మిదేవతలఁ దల్లడమొందఁగఁ జేసినట్టి యా
విపులయశస్కులౌమునులు వీరు నిజేప్సితప్రాప్తికిన్ మహా
సుపథమునీవెయంచు మదిఁజూచియకాదె! వృషాచలేశ్వరా! 62

మ. గహనంబందున నీవు బోవుతఱి నాఖద్యోతనోష్ణంబు నీ
కహితంబౌనని పక్షముల్బుఱపి పైనాచ్ఛాదనంబేర్చి ప్ర
త్యహముంబోవును బక్షులంబరమునన్ హర్షంబుదీపింపఁగా
విహగారూఢుఁడవంచు నెంచియకదా! విశ్వేశ! శేషాద్రిపా! 63

ఉ. వాలిని నీవు, వేయ ననివారణయానముతోఁడ వచ్చి నిన్
జాలఁగఁ దిట్టఁగోరి, జలజప్రతిమాన విలోకనా! మహా
నీలమనోజ్ఞవేష! యని నేర్పున స్తోత్రముఁజేసె దూఱఁగా
జాలెనె తార? సత్యబలశాంతి దయామయ! వేంకటేశ్వరా! 64

Scanned with CamScanner

శా. సౌమిత్రిక్షితిజాసమన్వితుఁడవై చాపాసియుక్తుండవై
యామౌనీంద్రులఁబ్రోవ నీవువనికిన్ హర్షంబుతోఁబోవ నీ
ధామంబందున నుండునట్టి జనసంతాపంబుఁ బోగొట్ట శ్రీ
ధామా! నీయనుజుండు పాదుకలు సంస్థాపించె శేషాద్రిపా! 65

ఉ. రావణుఁడాదిగా సకలరాక్షసుల న్వధియించి మైథిలీ
దేవి సుమిత్రపుత్రుఁడును దిగ్మమరీచిసుతాంజనాత్మజుల్
సేవలు సేయఁబుణ్యజనశేఖరు దివ్యవిమానమెక్కి రా
శ్రీవర నిన్ను గన్ననరుశ్రేయమె శ్రేయము వేంకటేశ్వరా! 66

ఉ. ఎట్టివి నీచకృత్యముల నెన్నిటి నైనను జేయుఁగాని నీ
గుట్టు నెఱింగిమానవుఁడు కుంభినిఁగొల్వఁగలేఁడు పాపముల్
తట్టయి మీఁదుద్రొక్కి సుపథంబునకేగఁగనీక రాయిడిం
బెట్టి యథోజగత్తునకు వెంటనె బంపఁగనుంట శ్రీహరీ! 67

మ. వ్రతముల్ బూనెదరాపగా తతులనవ్వారాశి స్నానంబులన్
గుతుకంబొప్పఁగ జేయఁగల్గుదు రహా! ఘోరంబులౌనిష్ఠలన్
గ్రతువుల్ సల్పుదురల్పులౌ సురలకున్ గామించిపూజాదులన్
సతమున్ గూర్తురుగాని నీదుపదముల్ సాధింప రహ్యాద్రిపా 68

ఉ. పుట్టలలోన క్షీరమునుబోయుదు రండజతుష్టికై సదా
కట్టలుఁగట్టి చెట్లకును గాండమునింపుదు రాలమందలన్
నట్టులఁజేర్చి పూజన మనారతమున్ వడిచేయుచుంద్రు నీ
చెట్టకుఁజేరఁ గష్టమని సేరరుపాపులు వేంకటేశ్వరా! 69

చ. నిను భజియింప నిన్నుగని నిత్యము సంతసమొంద పూజనం
బనువుగసేయ నీగుడికి హర్షముతోడుతఁబోవ ధ్యానమున్
బనివడిసేయ నంగములు పంచజనాళికి నిచ్చినాఁడవీ
వనునుడి వీడి చెడ్డపనులన్నియుఁ జేతురు వేంకటేశ్వరా! 70

Scanned with CamScanner

చ. పనియొకటింతయున్ననని పామరుఁడాదట పిల్లినైన నే
శునకమునైనఁదెచ్చి కడుశుభ్రమొనర్చి చరించుఁగాని నిన్
మనముననిల్పి ధ్యానమణుమాత్రముఁ జేయఁడుపాపియౌటచే
వనజదళాక్ష! సత్యమిది పన్నగరాజమహీధ్రపాలకా! 71

శా. ప్రాతంబందునలేచి కాల్యముల నిర్వర్తించి యామీఁదటన్
యాతాయాతజనంబుతో నధికమౌ హర్షంబుదీపింపఁగా
నీతుల్ జెప్పుచు సంచరింతురు జనుల్ నిత్యంబుమూఢాత్ములై
చేతో జాతగురూ! దలంపరు నినున్ శేషాచలాధిప్రభూ! 72

మ. ధనమున్జూచి యొకండమూల్య
మణులం ధాన్యంబులంజూచి యొ
క్కనరుం డల్పములైన భోగములచేఁ
గాంతాజనావాప్తిచే
జనుఁడొక్కండును భూమిచేంత
నొకఁడున్ సంతోషముంజెందుఁగా
ని నినుంగొల్వఁగలేఁడు ధాత్రి
శుభదున్ నిత్యంబు శేషాద్రిపా! 73

మ. కలుపుందీయ కృషీవలుండిడిన యాకళ్లున్ స్వనేత్రద్వయీ
కలుషీభూతికిఁ జేసికొన్న క్రియ లోకంబందు జీవాళి నీ
లలితారుణ్య పదాబ్జసేవకొఱకైలాలించి మీరిచ్చు యా
బలుదేహంబులచేఁతనే బడిరి బల్ బాముల్ వృషాద్రిప్రభూ! 74

సీ. నీ పూజనముసేయ నిచ్చిన కరములే
దుష్టపత్రము వ్రాయ నిష్టపడియె
నీ రూపమునకైన నేత్రముల్ సినిమాలు
వేశ్యకాంతలఁజూడ వేడ్కఁగొనియె

నినుగానియాడంగ, నెలవైననాలుక
తులువసాక్ష్యములందు నలమికొనియె
నీకథల్వినుటకు నెగడిన శ్రోత్రముల్
హాస్యముల్వినుటకు ననువులయ్యె
తే. సుందరంబగు నీగుడిచుట్టుదిరుగ
నిచ్చినట్టిపదంబులు, నెన్నియేని
దేశదేశంబులనువడిఁ, దిరుగుచుండె 75
విగతభవపాశ! తిరుమల వేంకటేశ!

సీ. గాఱియలఁగాయంగఁగోరి యొక్కఁడు రేయి
కన్ను మూయకచుట్టు బన్నియుండు
సలిలతీరంబున జలజంతువులఁబట్ట
గడగడలాడుచు మిడుకుచుండు
పొదలసందునడాఁగి పొంచి పిట్టలఁజంపఁ
గాచియుండునొకండు కాలమెంతొ
మిట్టచోటులనుండి మృగములవేఁటాడ
గమకించి యొకఁడు కాల్గదలకుండు
తే. నిట్టి కష్టంబులెన్నియో పట్టుదలను
జేయుచుండును దుష్టుండు చెన్నుమీఱి
నీదుదాస్యంబు సేయంగనేరఁడయ్య! 76
దందశూకధరేశ! పద్మాహృదీశ!

సీ. వ్యాపారములఁజేయ వాఛించి యొక్కండు
గోలసేయుచునుండు కాలమెంతొ
న్యాయాధికారు లానందంబు, నొందంగ
గొణుగుచుండు నొకండు గొంతువోయి

Scanned with CamScanner

తప్పుడుమాటలు తనవారిఁజెప్పింప
వాదులాడునొకండు పలువిధములఁ
గూలీలతో గొప్ప గోలఁజేసి యొకండు
కంఠహీనుండయి గదలకుండు

తే. నెన్నిపనులైనఁ జేయునుఁగన్న నిన్ను
నిమిషమాత్రము దలఁపఁడు, నీరజాక్ష
పాపబల మిదిగాక యే పగిది? సుమ్ము
విగతభవపాశ! తిరుమల వేంకటేశ! 77

మ. తలి గర్భంబుననుండి పుట్టుటయు
నుత్సాహంబునన్ బాలుఁడై
మెలఁగంజొచ్చుట యౌవనాధికుఁడునై
మేలొందుటల్ వృద్ధుఁడై
యలవుంబాయుట యంగముల్విడిచి
యన్యాంగంబులన్ దాల్పఁగా
విలయంబొందుట నీదుమాయ
గద! పో! విశ్వేశ! శేషాద్రిపా! 78

సీ. సౌదామినింబోలు స్వాపతేయముఁగాంచి
వ్యర్థమైనట్టి, జీవనమునమ్మి
బంధనప్రదులైన భార్యాదులను జూచి
కూర్మిఁగూర్చెడు పుత్రకులను గాంచి
మాటల నలరించు మాగధాదులఁ గాంచి
వశులైన భృత్యులఁ బశులగాంచి
నేరముల్వెదకెడు భూరిబంధులఁ గాంచి
భంగురంబగునట్టి బలము నమ్మి

తే. సంతసించుచునుగాని వాస్తవము నెఱిఁగి
నీదుభక్తినిఁజేయంగ నేరఁడయ్య!
పాపియైనట్టి మనుజుండు వాంఛతోఁడ
విశ్వలోకేశ! తిరుమలవేంకటేశ! 79

సీ. ఆనందమొందించు నారామములఁగాంచి
తుష్టిఁగూర్చెడు బలు దోడ్లఁగాంచి
ఆహ్లాదకరములౌ నాలయంబులఁగాంచి
సస్యసంపదగల జగతిఁజూచి
విత్తంబుగలిగిన పేటికలనుగాంచి
నాణ్యంబులైన యానములఁజూచి
క్రమంబులైనట్టి కాసారములఁగాంచి
వాసిఁగాంచిన దాసపంక్తిఁగాంచి

తే. యందమొందినశయ్యల నధిగమించి
తోషమందుచునుండఁగ దొందరించి 80
యాయువును బాపిలేపెద వార్తరక్ష!
విశ్వలోకేశ! తిరుమల వేంకటేశ!

సీ. దుస్తరమైనట్టి దుష్టసంసారంబు
నెప్పుడునవకాశ మీయకున్న
విషధర సమములౌ విషయంబులెప్పుడు
హృదయమందునఁ గ్రమ్మి కదలకున్న
పంచాస్యనిభములౌ పటుహృషీకంబులు
పలుతెఱంగులనైన బాధలిడిన
ద్వంద్వంబులెప్పుడు సందడిగొని తన్ను
బంధనంబుననుంచి బాదుకొనిన

తే. లెక్కసేయక నన్నింటి లేశమైన
నీవె సర్వంబు తనకని నెగడునొకఁడు
ధరణియందున వాఁడెపో! ధన్యతముఁడు
దందశూక ధరేశ! పద్మాహృదీశ! 81

కం. విరివిగ బాధలుగల్గిన
నరులందఱు తన్నుజూచి నవ్వినగానీ
తరుణులు నిరసించిన నీ
చరణంబులు విడువఁడొకఁడు సర్పనగేశా! 82

కం. నీ మాయగడఁగి ద్రొక్కిన
భూమీశులు బాధలిడిన పురజనులెల్లన్
సామాదుల బాధించిన
వేమరు నిను వదలఁ డొకఁడు వేంకటనిలయా! 83

మ. గతజన్మంబుల ధర్మముల్ జపములన్ గాంగేయదానంబులన్
వితతంబొందఁగఁజేసి యేఘనుఁడు వీతాఘుఁడై యుండునో?
యతఁడే మీ పదభక్తిసేయు నితరంబౌనట్టి కార్యంబులన్
సతతంబున్ మదిరోసివ్యర్థమనుచున్ సర్పేంద్రగోత్రాధిపా! 84

చం. వనముల దుర్గమంబులను వాసముఁజేసి యనేకవర్షముల్
ఘనమగు యోగమున్నెఱపి కాలవశంబున నష్టకర్ముఁడై
తనువునువీడి శిష్టజనధామములందునఁ బుట్టినట్టి యా
మనుజుఁడె నీకు దాసుఁడగు మాన్యచరిత్ర! వృషాచలేశ్వరా! 85

ఉ. ఆఱును నొండు జన్మముల నారవిఁగొల్చినవాఁడు శైవుఁడౌ
ధారుణి నట్టి జన్మములు తప్పక యన్నిటినొంది మీఁదటన్
శ్రీరమణీమనోహరుని సేవకుఁడై భువిఁబుట్టునంచు వి
స్తారములైన వేదము లజస్రము జెప్పు వృషాచలేశ్వరా. 86

చ. అవని భవంబు నెత్తు సమయంబున నెవ్వని నీవు జూతువో?
రవినిభతేజుఁడై యతఁడు రాగమువీడి భవత్ప్రభావ సం
భవ విపులార్థ దృష్టి నిను భావమునందుఁ దలంచి పూజనం
బవితథవృత్తిఁజేయుఁ బవనాశనరాజమహీధ్రపాలనా! 87

ఉ. పూతచరిత్ర! యే మనుజుపూర్వభవంబున భవ్యదివ్య ని
ర్హేతుక జాయమాన భవదిద్ధ కటాక్ష సులబ్ధిగల్గునో?
వీత కళంకుఁడై యతఁడు విశ్వము నశ్వరమంచు మీపదా
బ్జాతముఁ గొల్చు నిత్యమును సర్పకులేశ్వరగోత్రపాలనా. 88

ఉ. ఎన్నిటినైన నీ మనుజులెప్పుడొనర్తురుగాని యొక్క మా
రెన్నిక నీదువాఁడనని యెవ్వఁడుబల్కునొ? వానిబ్రోతునో
యన్న! యటంచుఁ బల్కు నినునారసిచూడరు చోద్యమయ్యెడున్
బన్నగ తల్పశాయి! సురపాలన తత్పర! వేంకటాద్రిపా! 89

చ. మనుజుఁడెవండు నాదు శుభమైత్రిని
గోరునొ? వాని నెప్పుడున్
మనముననైన వీడఁ గడుమాన్యుఁ
డతండు శుభేతరంబు లు
న్నను నవి మాకు భోగ్యమని
నాఁడు వనాటుల తోడ నాడవో
వనజ దళాక్ష! యీపగిది పల్కఁగ
నన్యుల కొప్పునా? హరీ! 90

ఉ. భానునితేజ మెల్లయెడ భాసిలుపోలిక నీదుకూర్మి యీ
మానవ బృందమందున సమానముగా విలసిల్లుగాని య
జ్ఞానులపైని పాపమను ఛత్రము పాయక యుంటచేత ని
న్గానరు నిక్కమీ వరుస నాగకులేశమహీధ్రపాలనా! 91

Scanned with CamScanner

ఉ. పంచశరాశ్వినేయులకుఁ బాలకమై యలపాకశాసనిన్
వంచనఁజేసి యక్షకులపాలకు పుత్రుని గేలిసేసి శో
భాంచితమైన నీదుమృదులాంగ విలోకన మాచరించి మో
హించెనుగాదె రాక్షసి యహీన మహీధ్ర శిరోవిభూషణా! 92

మ. బలిమింబట్టి మనుష్యులన్ మృగములన్ బంచత్వమొదించియా
పలలంబున్ దిని మోదమంది యడవిన్ వర్తించుచున్నట్టియా
పలితక్లిష్ట శిరోజరాక్షసి నినున్ వాంఛింప నీమానవుల్
జలజాతేక్షణ! గోరరెట్లు? భువిలో సర్పేంద్రగోత్రాధిపా! 93

కం. నినుగాంచి మోహమందని
జనులెవ్వరుగలరు? భువిని జడ లలమికొనం
దనువులు కృశింపఁజేసిన
మునులే మోహింప నడవి భోగీంద్రపతీ! 94

ఉ. భాసిలుచున్న నీ మొగముఁబాయక
చూచుచు నీ పదాబ్జముల్
వాసనఁజూచుచున్ సరసవాక్యములన్
గదు సంతసించుచున్
వాసిగ నీదు దేశమున వాసముఁ
జేయుచు నున్న యట్టి యా
కోసలదేశ మానవులె కుంభిని
ధన్యులు వేంకటేశ్వరా! 95

చ. యమ నియమాది యోగముల
నక్షతతిన్ గృశియింపఁజేసి ని
ర్మమతఁ జరించు మస్కరులు
మంగళరూపుని నిన్నుగాంచి మో

Scanned with CamScanner

హమున బహూకరింప బహుళార్తిని
వచ్చిరిగాదె దండకన్
సమయము గాదనన్ వగచి
శాంతి వహించిరి వేంకటేశ్వరా! 96

శా. స్ఫీతాబ్జప్రతిమానమై యసదృశస్మేర ప్రభోద్దామమై
శీతాంశుం దులకించు నీదు ముఖమున్ జింతించి చింతించియా
వీతాఘుండగు కౌశికుండు మదిలో వేఱొక్క జన్మంబునన్
బ్రీతిన్నీ కొగి దాస్యమున్ జలుపఁగా బ్రేమించె శేషాద్రిపా! 97

ఉ. అంబుజ దివ్యనేత్ర! కరుణాంబుధి! యోగిజనార్తిహార! స్వ
ర్ణాంబర! లేఖపంకరుహ హంసవిఖండిత శుక్ర శిష్యదు
శ్శంబల సర్వభక్తజన చాతకతోషణ నీలమేఘ కా
లాంబుదదేహ! శిష్టకలశాంబుధి సోమ! వృషాచలేశ్వరా! 98

ఉ. శారద నీరదాబ్జ ఘనసార పటీర మరాళ మల్లికా
సౌర ధునీభవాచల తుషారభ మౌక్తికకాశ హ్రాదినీ
పారద నారదాభ్రగజ పన్నగరాజ హిమాద్రిపింగదృ
క్సారసవైరి కల్పనగ సన్నిభకీర్తి! వృషాచలేశ్వరా! 99

మ. చటులులాంహెూనికరాంబుభృత్ప్రలయజంఝూవాతలేఖద్విష
త్కుటిలాద్రివ్రజశంబ ధారితలసత్కోదండ పంచాయుధో
త్కట సింధుప్రబలావలేపవన విస్తారాశ్రయాశా పద
స్ఫుటితాజాండకటాహ రక్షితజగద్భ్రూభంగ శేషాద్రిపా! 100

మాలినీ వృత్తము

అగణిత గుణజాలా! యంబుదాత్యంతనీలా!
విగతభవవిపాశా! విశ్వదైతేయ నాశా!
నిగమ శిఖరివాసా! నీరజాప్తాభ భాసా!
జగదుదయ వికల్పా! సత్య నాగేంద్రతల్పా! 101

Scanned with CamScanner

శ్రీ శేషనగేశస్తవము

ద్వితీయాశ్వాసము

చ. సనకసనందనాది ముని సంఘమనోవన చైత్ర! శంకరా
జనముచిసూదనాద్యమరసంకులసంకటనాశనా! ప్రభూ
ఘన నిభ దేహ! భక్తజనకల్పక! యాదవవంశ వర్ధనా!
వనజ మనోజ్ఞనేత్ర! బుధవత్సల! శేషనగాధిపాలనా! 1

ఉ. ఆనకదుందుభిస్థలమునందున నీవు జనించునప్పుడే
భానునిబోలి యాగృహము భాసిలఁజేయుచు శంఖచక్రముల్
బూని చరించునప్డు గని పుణ్యులు మీ తలిదండ్రులేవిధిన్
సూనుఁడవైన నిన్ను గని స్తోత్రమొనర్చిరొ? వేంకటేశ్వరా! 2

ఉ. శిష్టులఁబ్రోవ దుష్టజనశిక్షణ మొప్పఁగ మానవాకృతిన్
విష్టవమందు నీ సహజవేషముతో శుభలగ్నయుక్తమౌ
నష్టమియందు బుట్టుమని యంబుజయోనిశివాది దేవతల్
తుష్టినిఁ బొంది నిన్నుగని స్తోత్రముఁజేయరె? వేంకటేశ్వరా! 3

చ. కరముల శంఖచక్రములు గ్రాలఁగఁ గౌస్తుభరత్నదీప్తిచే
నురము వెలుంగ వేశ్మమున నుద్భవమొందెడు నిన్నుగాంచి యే
వెరవునఁ దల్లిదండ్రులతి విస్మయమొందిరొ? మోదమొందిరో?
సరసిజనేత్ర! చెప్పుటకు శక్యమె మాకది? వేంకటేశ్వరా! 4

ఉ. చేలములేక బాల్యమునఁజిందులఁ ద్రొక్కుచు సూక్ష్మఘంటికా
జాలము మ్రోయ మధ్యమున, శారదచంద్రికఁ బోలునవ్వుతోఁ
గ్రాలెడు నిన్ను గోవులనుగావఁగ బంపఁగ నందుఁడున్ మహా
శీల యశోద పుణ్యమును జేసిరొ యెంత? వృషాచలేశ్వరా! 5

Scanned with CamScanner

ఉ. చెమ్మట చీమురక్తమును జీమిడిమేదము మాంస మూత్రరో
గమ్ములు గల్గినట్టి కడుకల్మషయుక్త సుతాళిఁబ్రోచు లో
కమ్ములఁగల్గు మానవులకంటెను ప్రేమను నిన్ను బెంచి మో
దమ్మునుగాంచు నీతలియుఁదండ్రియు నెంతటివారొ? శ్రీహరీ! 6

ఉ. గోకులమందున న్గలుగు గోపకుమారులు నిన్నుఁజూచి యో
రాకొమరుండ! యోసఖుఁడ! రమ్మిటు గోవులఁదోలుకొంచు నా
వాకకుఁబోద మంచు నిటుపల్కుదురెప్పుడు బాలకాళి యే
పోకడఁజేసిరో తపము పూర్వభవమ్ముల? వేంకటేశ్వరా! 7

మ. యమునాద్వీపవతీ తటంబున రసాలానోకహాంతబునన్
గమలంబుల్ ఘనచూతపల్లవములన్ గల్పించి తల్పంబు నీ
సములౌ బాలురు దానియందున నినున్ సత్ప్రేమతోనుంచి ని
త్యము సేవింతురు వారికెట్టిఫలమో? దర్వీకరాద్రిప్రభూ! 8

ఉ. ఓరివయస్క! కృష్ణ! పురుషోత్తమ! యాదవ! నందనందనా!
రార బలానుజా! యని సరాసరి నిన్బిలువంగ గోపకుల్
ఘోరతపంబు లెట్టివిగఁ గోనలఁజేసిరొ? వారి దాసు లే
ధారుణిఁగల్గు సర్వులును దానవవైరి! వృషాచలేశ్వరా! 9

చ. హలికులిశాది చిహ్నముల నందములైన భవత్పదాబ్జ సం
కలిత పవిత్రదేశములు గల్గిన యా యమునాస్రవంతియున్
సులలితవృక్షపంక్తులను శోభిలు బృందయు గొల్లవల్లెయున్
గలిసి తపంబులెట్టివిగఁగాంచెనొ? పూర్వము వేంకటేశ్వరా! 10

సీ. గురువెందసరులు కంధరమున ధరియించి,
మాయూర పింఛంబు మమతఁదాల్చి
కరమున మురళి చక్కఁగఁబూని నేత్రంబు
నంసభాగంబున నలవరించి

Scanned with CamScanner

మాధ్యాహ్నికంబగు దధ్యన్నమును మూటఁ
గట్టి కరంబున బట్టికొనుచు
పదముల కనువగు పాదుకలను బూని
గొల్లపిల్లలు వెంటఁగొల్చుచుండ

తే. గోవులను మేఁపుటకు నాఁడు ఘోషమందు
గోపవేషంబు వేసితే? పాపదూర!
సర్వవేషంబులును నీకె సాధ్యమయ్యె!
దందశూక ధరేశ! పద్మాహృదీశ! 11

చ. పసులకులంబు మేతలకుఁబాసి చలింపవొకింత వ్యాళముల్
మసలక వేడ్కలన్ వినియె మంజునినాదముఁభాసి పక్షులున్
విసరములై మనోహరత వీనులవిందును నొందె శ్రీశ! నీ
యసదృశ వేణురావమున నంబుజనేత్ర! వృషాచలేశ్వరా! 12

ఉ. పాదపరాజి చంచలతఁబాసి స్థిరత్వముఁగాంచె శాస్త్రముల్
వేదములెల్ల మోదమును విస్మయమొందె ధరాధరంబులున్
పాదరసంబువోలెఁ దమపాటవమేది స్రవించె లోకముల్
ఖేదము వీడె నీదుమురళీ నినదంబున! వేంకటేశ్వరా! 13

చ. కమలభవుండు జీవతతిఁ గల్పనఁజేయుచు నీదు వేణు గా
నము విని లేఖినిన్ విడిచి నాదమునందు నిమగ్నుఁడై శిరం
బు ముదమునన్ వడంక నరమూర్తి ధరించిన నిన్ను వేదవా
క్సుమములఁ బూజఁజేసెగద! కుండలినాథ మహీధ్రనాయకా! 14

మ. యముఁడాత్మీయ నియోజ్యవారములచే నానీతులౌ ప్రాణిపా
పములంబుణ్యములం గ్రమంబున ద్విధాభాగించుచున్ నీదుగా
నముచే లోకశరీరముల్మఱచి విన్నాణంబు పోఁబంపె దు
ష్టమనుష్యాధములం దివంబునకునై సర్వేంద్రగోత్రాధిపా! 15

మ. సురనాథుండు త్వదీయగానమునకున్ శ్రోత్రంబులన్ విప్పి ని
ర్భరుఁడై దేవమృగాక్షులన్ విడిచి నిర్వ్యాపారుఁడైయుండు సా
విరహిన్ జెల్లెను దేవతావిభునకుం వృద్ధశ్రవుండంచు నీ
ధరణిన్ నామము దానినెన్నగలమే తర్కించి శేషాద్రిపా! 16

ఉ. శారదరాత్రివేళ జలజాత విరోధి మనోహరాంశు వి
స్తారగుఁడై వెలుంగ సురసన్నుత వంశినిఁబూని గ్రావముల్
నీరములై స్రవింపఁగడునేర్పున నూదుచునుండఁ దద్ధ్వనిన్
కోరికదీర విన్నజనకూటమి జన్మము ధన్యమౌప్రభూ! 17

మ. జగదానందదమైన నీదు మురళీ సంజాతగీతంబుచే
విగతాపార భవార్తి బంధలగుచున్ వేగంబ నిన్గూడిరా
మృగశాబాక్షులు ఘోషమందటుల బ్రేమింపన్ గతంబందునే
వగఁగావించిరొ పుణ్యతీర్థజపముల్? వాంఛించి శేషాద్రిపా! 18

శా. నీతోఁగూడిచరించుచున్ శుభదమౌనీరూపమున్ జూచుచున్
జేతోజ్జాత విలాసము ల్గనుచు నీచే మన్ననల్ బొందుచున్
జాతుర్యంబులు నీదు వాక్యము లజస్రంబున్ వినన్గోరుచున్
బ్రీతింజెందుట కేమి వింత వనితల్? విశ్వేశ! శేషాద్రిపా! 19

ఉ. బాలుఁడవయ్యుఁ బర్వతముఁబట్టి కరంబున లేవనెత్త గో
పాలురు పుత్రమిత్రపశుపత్నులఁగూడి ధరంబుక్రింద నే
లీలఁజరించిరో? నిఖిలలేఖ విభుండపుడేమి యెంచెనో?
పాలన మెట్లుజేసితివొ? వర్షమునుండి వృషాచలేశ్వరా! 20

మ. సురలోకేశ్వరుఁడయ్యు గీష్పతికి శిష్యుండయ్యు లోకాళికిన్
గరిమన్ బాలకుఁడయ్యు నీ "భువనముల్! గాపాడఁగాఁబుట్టుమీ
సరసీజోదర!" యంచు వేఁడియును నా జ్ఞానంబుఁబోఁబెట్టి యే
సరణిన్ నిన్నుఁబరీక్షఁ జేయఁదలఁచెన్? సర్వేంద్రగోత్రాధిపా! 21

ఉ. గోపకుమారవర్గముల గోశిశురాజినిఁ గందరంబునన్
గోపనమొప్పఁజేసె సురకోటి గురుండగు బ్రహ్మనిమ్మదిన్
శ్రీపతివంచు నెంచక, వరిష్ఠునినైనను నీదు మాయతా
కాపురుషప్రధానునిగఁ గల్పనఁజేయు వృషాచలేశ్వరా! 22

ఉ. పుట్టెడువాని వృద్ధిగని పోడిమినొందెడువాని క్షీణతన్
బట్టునుబాయువాని భవబంధముచేతఁదలంకువాని నీ
నట్టున దేహరాజియు క్షణంబున వీడెడువానిఁ జూచియున్
రట్టడి మోహపాశముల రాయిడి వీడరు వేంకటేశ్వరా! 23

చ. భవమనుయంత్రమందునిడిబంధనమొప్పఁగఁజేసి మాయయన్
యవనిక వేసి మోహమును నాఅడిపాశము నంటగట్టి యీ
భువనము నందుఁద్రిప్పెదవు భూత తతిన్ నిఖిలేశ! లోక మం
దెవరు నెఱుంగరీవిధము నెన్నటికైన వృషాచలేశ్వరా! 24

మ. బలవంతుండవు ద్రిప్పుచుండ జగతిన్ బ్రహ్మాదులౌ సూక్ష్మదే
వులనొక్కండును లేఁడునాగుటకునై వ్యత్యాసమున్ లేదుదో
మలు వేలొక్కటఁజేరి యాపగలవే మాతంగరాజంబు నీ
కిలసాటిందగఁ జేయువాఁడుగలఁడే? యెందున్ వృషాగప్రభూ! 25

ఉ. ఎన్నియుగంబు లేగినవొ? యెందఱు భూమినిసంచరించిరో?
మన్ననకెక్కి యేపగిది మానముఁగాంచిరొ? యెట్లు బోయిరో?
క్రన్నన నెట్లు రాగలవొ? కల్పములెన్నియొ జీవులెన్నియో?
యన్నియు నీకు గోచరములై పడియుండును వేంకటేశ్వరా! 26

కం. లోకులకు మేలుసేయఁగ
లోకంబుల శుభముఁగూర్ప లోఁగొని యనిలో
వాకొంటిని తత్త్వంబును
బ్రాకటముగ నర్జునునకు వ్యాళనగేశా. 27

Scanned with CamScanner

కం. వేదోప బృంహణంబగు
వాదముఁజెప్పితివి నాఁడు పార్థుండడుగన్
గాదనక రూపముద్ధతి
మోదంబునఁజూపి తల్లె భోగిధరేశా! 28

కం. మాటలు జెప్పెడు వారలు
కోటులు లక్షలునుగలరు కోరినయపుడే
దీటైన సాక్ష్యమియ్యఁగ
సాటిఁక నీకొరుఁడు గలఁడె సర్పనగేశా! 29

కం. సచరా చరమగు లోకము
విచలితమై వెలయుచుండ వెలిఁగెడు నీ యా
శుచిఁజూడలేక పార్థుఁడు
కచములు వీడంగ వడఁకెఁగాదె రమేశా! 30

సీ. ఆదిత్య తేజంబు, నవఘళింపఁగఁ జాలు
దివ్యమైనట్టి నీ దీప్తిఁజూచి
బ్రహ్మాండములనిండి ప్రభవించినట్టి నీ
భయదమౌ రూపంబు, బాఱఁజూచి
ప్రళయాగ్ని బింబంబు, పగిది లోకంబులఁ,
దపియింపఁజేయు నేత్రములఁజూచి
కాలసర్పంబుల బోలి యజాండంబు
నాహరించెడు రసనాళిఁజూచి

తే. కంపితాంగంబు గలిగి యాకదనమందు
దిక్కుగానక పడియె కుంతీసుతుండు
కోరి నీ రూపమునుజూడ నేరి తరము?
విశ్వలోకేశ! తిరుమలవేంకటేశ! 31

Scanned with CamScanner

సీ. ఏ దిక్కు చూచిన నీదుశిరంబులే,
యేదిశ గన్న నీపాదసమితి
యేయోరగన్నను నీ యాయుధంబులే
యెటుచూచినను నీదు పటుభుజములె
ఏదేశమును గన్న నీ దివ్యకరములే
యెందుఁజూచిన నేత్రబృందసంఖ్య
యెచ్చట జూచిన బేచ్చలపతకంబు
లెచటఁజూచిన నీదు, కచచయంబు

తే. గానఁబడియెను గాదె సంక్రందనాత్మ
జునకు నీ విశ్వరూపంబుఁ జూపువేళ
నెట్లుజూచెనొ? తలఁచెనో? యెట్టులతఁడు
విగతభవపాశ! తిరుమల వేంకటేశ! 32

సీ. చండభానుని భానుసంఘంబువలెఁజూడ
నలవిగాక యొకప్పు, డతిశయించు
నబ్జబింబముబోలె నందమై చల్లనై
గన్పట్టుచుండు నొ, కానొకప్పు
డగ్నిమండలమట్టు లధికమైయుష్ణమై
భయదమై యొకసారి ప్రజ్వలించుఁ
బ్రాలేయ శీకర ప్రతిభమైగన్పడు
విమలమై యొక్కొక్క సమయమందు!

తే. సవ్యసాచికి నీ నేత్ర సమితి పోర
నెట్లు జేసితివయ్య! యీ యింద్రజాల
మెవరియొద్దను నేర్చితో? యీశ! నీవు
వృషభగిరివాస! పద్మేశ! వేంకటేశ! 33

సీ. నేత్రద్వయంబుచే, నెగడెడు నీవెట్లు
వేల లోచనముల వెలిఁగినావొ?
రెండు చేతులతోడ నుండెడు నీవెట్లు
బలుబాహుశాఖల వెలిసినావొ?
రథ మధ్యమందున రాజిల్లు నీవెట్లు
దండిగా భువనంబు నిండినావొ?
మిత్రరూపంబున మెలఁగెడు నీవెట్లు
భయదమౌ తీవినిఁ బ్రబలినావొ?

తే. విశ్వరూపంబుఁ జూపెడు వేళయందు
నీదు వేషంబుఁగన్న యా నిర్జరాదు
లర్జునుండును ధన్యులీ యవనియందు
దండశూకధరేశ! పద్మాహృదీశ! 34

సీ. అసుర నాయకులంద ఆర్తితో మెలఁగిరి
యక్షులందఱు మూసి రక్షియుగము
దేవతలెల్లను దివి సన్నుతించిరి
పైశాచకులములు బాఱఁజూపె
భక్తబృందములు భజనలుజేసెను
మునిసమూహంబులు ముదమునొందె
సిద్ధసంఘంబులు సేవింపఁజొచ్చెను
విద్యాధరులు గానవివశులైరి

తే. నీవు లోకంబు నిండినసావి యందు
మనుజులెట్లెట్లు దలఁతురో? మహిని నిన్ను
నట్లె దోఁచెదవయ్య! నీలాభ్రదేహ!
దండశూకధరేశ! పద్మాహృదీశ! 35

Scanned with CamScanner

సీ. యదువంశమందున నధికుండ వీవని
పంతమాడినవారు కొంతమంది
యర్జునురథమును నదలింపమనమునఁ
గోరివచ్చితివంచుఁ గొంతమంది
పాండునందనులకుఁ బరమమిత్రుఁడ వౌటఁ
గూడి వచ్చితి వనికొంతమంది
నలుగురితోఁ బాటు కలిఁజూడఁగాఁ గోరి
చెంతఁజేరితివంచు కొంతమంది

తే. రహి దలంచిరి భారత రణమునందు
గాని యీశుండవనుచు నీ, కదనలీల
నీదె యంచును నెఱుఁగంగ నేరఁడొకఁడు
విగత భవపాశ! తిరుమల వేంకటేశ! 36

క. పాండవ బలములతో నిను
దండింపఁగ గోరివచ్చి ధరణిపముఖ్యుల్
మండెడు పావకులోద్భృణ
ఖండంబులపగిది నైరి కంజాక్షహరీ! 37

చం. సచివుఁడవంచు బంధువని సారథివంచుఁ దలంచినట్టి యా
యచల విరోధిపుత్రుఁడు భయాతురుఁడై మొగమెల్లవెల్లనై
కచములువీడ నెవ్వఁడవు కార్యము నేమిదలంచికోపివై
యిచటికి వచ్చితీ! వనియె నిందిరనాథ! యహీంద్రనాయకా! 38

మ. ధరణీభారముఁబాపనెంచి కలినుత్పాదించి పృధ్వీశులన్
గురుభూమిన్ వడిఁజేర్చి యందఱిని నీకోపాగ్నిచేఁ గాల్పఁగా
నరు రథ్యంబులఁ దోలినాఁడ విదిభూనాథోత్తమ స్తోమమం
దరయున్ లేడొకఁడైన నీదు క్రియగా నాశీవిషాద్రీశ్వరా! 39

Scanned with CamScanner

శా. భూనాథోత్తములందు నొక్కొకని బల్ పోరించిపోరించి స
న్మానంబిచ్చి మహానుభావుఁడనఁగా మర్యాదఁజేయించి య
త్యానందంబొడఁగూర్చియంతమునకయ్యాధిక్యమున్ బాపిస్వ
స్థానంబుల్ వడిఁజేర్చెదీవెగద! హే సర్వేంద్రగోత్రాధిపా! 40

శా. గాంగేయుండు పరాక్రమించి నరునిన్ గంధర్వరాజంబులన్
మాంగళ్యాత్మక! నిన్నునుం దరుమనున్మాదంబుతో నున్న యా
సంగాతిన్ నెటిబ్రోవనెంచియెకదా! సంగ్రామరంగంబునన్
భంగంబొందఁగ గౌరవుల్, దుముకుటల్? పద్మావతీనాయకా! 41

సీ. శోణరత్నస్యూత, సుందరమకుటంబు,
మిహిరమండలదీప్తి మించివెలుఁగ
దివ్యనేత్రోద్భూత దీధితి దశదిశా
వలయంబులకు రక్తవర్ణ మొసఁగ
నీలాంబువాహ సన్నిభసంహనన కాంతి
యంతరాళమునకు వింతఁగొలుప
పదపద్మఘట్టన ప్రబల భారంబున
నురగేంద్రుఁడలసట శిరమువంపఁ

తే. ప్రబల పరిపంథి నాశన ప్రభవెలుంగ
దూఁకితివిగాదె చక్రంబుతోడ నీవు,
విష్ణుపదిసూనుమీఁదికి వేడ్కతోడ
విగతభవపాశ! తిరుమల వేంకటేశ! 42

సీ. ఖగపరివృఢుఁగన్న కాకోదరములట్ల
కంఠీరవముఁ జూచు కరులపోల్కి
వ్యాఘ్రమున్ వీక్షించు వంచకంబులభంగి
రవిరాకచేఁ దిమిరములపగిది

ప్రబలవాతంబున వారిదంబులరీతిఁ
గాలునిఁగన్న జీవాళి లేవ
నడవిదావముగన్న హరిణసంఘమువగ
నహినిఁగన్నట్టి యాయాఖులగతిఁ

తే. గాళ్లు తడఁబడ మొగములఁ గాంతిదఱుగ
భీతి బాఱిరి దిశలకు భీష్మమీఁది
కరుగు నినుగాంచి సమితి నా యఖిలజనులు
దందశూక ధరేశ! పద్మాహృదీశ! 43

సీ. శీతాంశురాకచే సింధునాయకుఁడట్లు
తరణినిఁగన్న యా తామరవగ
పర్జన్యుఁగాంచిన వానకోయిలరీతి
ద్రవిణమున్ గన్న నిర్ధనికునట్ల
సురదీర్ఘకావాప్తి, నురుపిపాసువుపోల్కి
సుధనుబొందినయట్టి క్షుధితులేవ
నిష్టదేవఁగన్న యేకాంగి వడువున
నాశ్వినేయులఁ బొందు నార్తునట్ల

తే. నిన్నుఁగాంచి ముదంబున నెన్నొగతులఁ
బ్రీతిస్తోత్రంబుఁజేసెఁగా! భీష్ముఁడపుడు
భక్తియొదవును నినుజూడ భక్తతతికి
విగతభవపాశ! తిరుమల వేంకటేశ! 44

మ. జలజాతప్రభవాది సన్నుతుఁడవౌ స్వామీ! నరుం గావఁగా
విలసచ్చక్రముఁ బూనినాడవు భళీ! వేవేగరారమ్ము నీ
వె, లలింజంపుటకంటె నాకుఁగలదే విశ్వంబునం దిష్టమం
చలగాంగేయుఁడూవాదులాడెనుగదా! హర్యద్రిపశ్రీహరీ! 45

ఉ. పట్టినకత్తి దింపకుము పద్మదళాక్ష! యటంచు భీష్ముఁడున్
రట్టు దలంచకయ్య! యిటురమ్మురథంబున కంచుపార్థుఁడున్
గట్టిగఁ బల్కుచుండ రణగహ్వరి నేమి దలంచినాఁడవో
దిట్టలు భక్తులిద్దరును దీర్పఁగరాదు వృషాచలేశ్వరా! 46

ఉ. మొండిశిఖండి యుద్ధమున ముందలఁబెట్టినఁగాని భీష్మునిన్
దండితుఁజేయ వీవటుల దప్పకఁగల్గదె నిక్కమల్ల వే
ధోండములెల్ల నీకెదురె? యంబుజలోచన! భక్తుఁడౌటచే
నిండు యశంబు నీజగతి నింపుటకై కద! వేంకటేశ్వరా! 47

చ. అరదమునందు నుంచి బలునాశుగరక్షణఁజేసి సైంధవున్
బరువడిఁ బ్రోచినారె? యలపార్థివలోకములెల్ల నేకమై
ఖరకరబింబమున్ జగతిఁగన్పడకుండఁగఁజేసి తీర్చితా
సరసిజనేత్ర! మీకిల నసాధ్యమె యొక్కటి? వేంకటేశ్వరా! 48

చ. జగతికినెల్ల నొక్కటయి సంతమసంబునుమాపి రేయియున్
బగలొనరించునట్టి యలభాస్కరబింబముఁ గప్పినాడ వా
నిగమమయుండు నీకు నొకనేత్రముగావున మూసితట్లుగా
క గలవె యిట్టి కృత్యములు కాశ్యపినెందున? వేంకటేశ్వరా! 49

చ. ఇలఁగల సర్వవస్తువులనెల్లను గ్రమ్మఁగ సాధ్యమౌనుగా
కలవియె నీదుమాదిరి నహస్కరబింబము మాయశక్తిచే
జలజభవామరేశగిరిజాపతులందున లేఁడిఁకొక్కఁడున్
విలసితమైన యిట్టిపని వేసటజేయ వృషాచలేశ్వరా! 50

సీ. పశుపతి మెప్పించి, పాశుపతాస్త్రంబుఁ
గైకొన్నయట్టి యా ఘనబలంబు
త్రిదివంబునకు నేగి త్రిదశేశ్వరుని యొద్ద
ప్రాప్తించినట్టి సత్రొపిధిమయును

Scanned with CamScanner

గలశసంభవునొద్ద, గలకాలము శ్రమించి
యార్జించినట్టి యా యస్త్రశక్తి
యఖిల రాజన్యుల నగ్రగణ్యుండని
ఖ్యాతిఁగాంచిన యట్టి ఘనయశస్సు

తే. నెందు బోయెనొ? సైంధవు నేయునాఁడు
సవ్యసాచికి నీ దివ్యశక్తికలిమి
జయముఁగాంచిరి పాండవుల్ సంగరమున
విశ్వలోకేశ! తిరుమల వేంకటేశ! 51

చ. అనలునియందు వేఁడిమి యహస్కరునందునఁదేజముల్ సమీ
రుని గలవేగ మిందుగతరూపము ధాత్రికిఁగల్గు స్థైర్యమున్
వనధిగభీరభావమును వారిదమందున గల్గు వర్షమున్
ఘనగుణ! నీ విభూతులివి కావె? పిచండవరాద్రినాయకా! 52

ఉ. భారతగాథయం దఖిలబంధురధర్మములన్ రచించియున్
దీరని దుఃఖమొంది యలదేవమునీంద్రుఁడు సెప్పఁగా నినుం
గోరి నుతించి వ్యాసముని కూర్మిఁగడించెను శాంతి-దేవ! నిన్
జేరి భజింపకేవగను శ్రేయముగాంతురు? వేంకటేశ్వరా! 53

మ. మునులుందేవతలున్ భజింపరథమున్ మోదంబుతోనెక్కి యా
జననాథోత్తముఁ జేరితట్లై మఱియున్ సద్భక్తుఁడౌ బాడబుం
గన వే బోఁయితివయ్య! యామిథిలకుం గల్పింపమౌనీంద్రులన్
ఘనులన్ దివ్యుల నీకెచెల్లు జగతిం గాకోదరాద్రిప్రభూ! 54

ఉ. నన్నేజూడఁగవచ్చెనంచు నృపుడున్ నర్గోరి రక్షింపఁగా
మన్నాథుం డరుదెంచినాఁడిచటికిన్ మద్భాగ్యమేభాగ్యమౌఁ
గన్నారం దమిఁజూడఁగల్గెననుచున్ క్ష్మానిర్జరుం డెంచెఁగా
కన్నా! నీమహిమంబుఁగాన రెవరున్ హర్యద్రిపా! శ్రీహరీ! 55

Scanned with CamScanner

ఉ. మేమును నుంటిమట్టులె యమేయగుణాఢ్యునితోడ నెట్లుగా
నామహితాత్మతోఁ గలిసియచ్చటనుంటిమొ రెండుచోట్లమా
కేమియుగోచరింప దచలేశ్వర! మేము భజించినట్టిదౌ
నీమహిమంబటంచు శుకుఁడెంతయునాడడె? వేంకటేశ్వరా! 56

ఉ. సంతమసావృతంబునయి స్పర్శనలేశములేక కష్టమై
వంతయు నంతులేక యెటుప్రక్కగదల్పఁగ వీలుగాని సీ
మంతిని గర్భమందు నవమాసములెట్టుల జీవునుంతువో
యింతయునీదుమాయయని యెంతుము మేము వృషాచలేశ్వరా! 57

ఉ. పుట్టినయప్పుడే జనుఁడు భూరిక్షుధాతురుఁడై స్తనంబులన్
గుట్టునెఱింగి గ్రోలుటయుఁ గూరిమి తల్లినిగుర్తుపట్టి యా
పట్టుననేడ్చుటల్ మఱియు భావములంగని పెట్టియుండఁగా
నెట్టుల గూర్చితో జగతి నేలినవాఁడ! వృషాచలేశ్వరా! 58

మ. ధరనేరీతిని నిల్పితో? ఖగుని కే తల్పంబుఁగావించితో?
శరదవ్రాతము నెట్లునిల్పితౌ? దివిన్ స్పర్శంబు నెట్లుంచితో?
సరవిం గూర్చితౌ యెట్లుగా? దివమునన్ సత్సంతతిన్ సర్వమున్
జతురంబైన త్వదీయామాయయెగదా! సర్వేంద్రగోత్రాధిపా! 59

శా. పాషాణప్రకరంబునందున మహాపాథస్సు జన్మించుటల్
దోషాధిష్ఠిత మౌ మృగంబున జనస్తోత్రార్హకస్తూరియున్
భాషాజ్ఞానము పక్షిసంతతికి సద్భావంబుగోరాజికిన్
శేషాద్రీశ్వర! నీదు మాయయెగదా! చింతింప సర్వేశ్వరా! 60

మ. సరఘాసంఘము పుట్టలందు మధువున్ సంధించుటల్ రాల భా
స్వరరత్నంబులు పుట్టుటల్ కరితతిన్ వాసించుటల్ ముత్యముల్
పరమౌసాంకవమోతు గాత్రముననేవర్తించుటల్ ధారుణిన్!
గురుభారంబగు నీదుమాయయెగదా! గూఢాంఘ్రిగోత్రాధిపా 61

Scanned with CamScanner

ఉ. కోటులు లక్షలున్ ధనము కొట్లకుఁ బోసినవారుగాని వా
గ్ధాటిని సర్వమానవుల దందరనొందఁగఁజేయువారు నే
పాటునులేక లోకములబల్విడి ద్రిమ్మరువారు గాని నీ
పాటవయుక్తమాయయను వారిధి దాఁటఁగ లేరు శ్రీహరీ! 62

ఉ. కన్నొకటున్నవారు మతిఁగాంచిన వారవి రెండు, మూఁడుగా
నున్న మహానుభావులు నహెూయవివేయిగనున్నవారలున్
దిన్నగ నష్టనేత్రములఁ దేజమునొందినవారుగాని యో
వెన్నుడ! నీదుమాయయొక వీసమెఱుంగరు వేంకటేశ్వరా! 63

చ. జగతి సమస్తధర్మముల స్థాపనజేయఁగఁ బుట్టినట్టి నిన్
విగత వివేకుఁడౌట మునివేఁడఁగలేక దలంచెఁ దిట్టఁగా
మొగమదిజేవురింపఁ నలమూర్ఖుఁడుదంకుఁడు వానిపాపమే
వగభునినెన్నవచ్చు? జనపాపవిదారణ! వేంకటేశ్వరా! 64

సీ. పంచేంద్రియంబుల బంధించి యచలురై
స్థావరంబులబోలెఁ దనరువారు
పెక్కు యోగంబుల ముక్కులు మూసియుఁ
జెట్లగుట్టలచెంతఁ జేరువారు
ప్రాణవాయువులను బదిలంబుగాఁజేసి
పుట్టలుబట్టఁగ బొదలువారు
శాఖికొమ్మలఁ దమ చరణముల్ దవిలించి
సూర్యమండలమున జూచువారు

తే. కోర్కి నెప్పుడు మవమున గొణగువారు
నీదు నామంబుఁజేసెడు నేర్పరులకు
సములుగారయ్య! భువిలోన సత్యమింత
దందశూకధరేశ! పద్మావతీశ! 65

Scanned with CamScanner

చ. సనకసనందనాదులును సర్వదిగీశులు చిత్తమందునన్
గనుఁగొనలేని నిన్నొకఁడు కాలవశంబునఁ బట్టఁబూని తా
వెనుకొనిపోయి యొక్క పృథివీపతిచూపున భస్మమాయె నా
ఘనగుహనంతజూచి నినుగానఁగలేక వృషాచలేశ్వరా! 66

ఉ. మ్లేచ్ఛుఁడు నీదువెంటఁబడి మేదిని నెంతొతరించెఁగాని నీ
స్వచ్ఛవినీలగాత్రమును బాణిని నంటఁడు పాపకర్ముఁడౌ
తుచ్ఛుఁడు గానలోకమున దోషులు నీదు సమీపమొంది నీ
సచ్చరితంబెఱుంగ రిది సత్యము శేషమహీధ్రనాయకా! 67

శా. నేత్రాంతస్ఫురదగ్ని మ్లేచ్ఛునివడిం నిర్దగ్ధునింజేసి యా
గోత్రాధీశుఁడు చూడనేరక నినుం గోత్రారివో? పాశివో?
చిత్రాంశుండవా? లేక సర్వజగముల్ చిత్రించు విష్ణుండవో?
విత్రస్తుండనటంచుఁ బల్కెనుగదా విశ్వేశ శేషాద్రిపా! 68

చ. నిరుపమతేజ! యిప్డు మహనీయుఁడొకండు మదీయదృష్టిరూ
పతి వడి భస్మమాయె గురుభాస్వరలోచనముల్ త్వదీయభీ
కరమగు దివ్యరూపమును గానఁగఁజాల నెవండ? వంచు నా
ధరణిపుఁడాడె నిన్నుగన ధాత కశక్యము వేంకటేశ్వరా! 69

ఉ. పావనరూప యాత్రిదివవాసులు మున్నువచించినట్టి నా
సేవధివోవచింపు నినుఁజిన్మయుఁ జూచుటనాదు జన్మమున్
భావము సార్థకంబులని పల్కుచు నాముచికుందుఁ డంతటన్
దేవ భవత్పదంబుల నుతించుచు వ్రాలఁడె? వేంకటేశ్వరా! 70

మ. నరదేవుండని మానవుల్ గొలువఁగా నారీసహస్రంబుతో
వరయానంబులనెక్కి పోయితి నపూర్వస్ఫూర్తినజ్ఞానినై
పరమేశున్ నినుగాననైతి! నపుడోపద్మోదరా! శ్రీహరీ
కరుణావారిధి! యంచు పల్కెనృపుఁడో కాకోదరాద్రిప్రభూ! 71

Scanned with CamScanner

మ. జపముల్ జేసిన యోగిసత్తములచే సాధింపరానట్టి యా
సుపథంబొందె వసుంధరావిభుఁడు సచ్ఛోభావహాంబైన నీ
లపనాంభోజముఁ గన్నవారి కరుదే? లక్షింపఁ గల్యాణముల్
వపువున్ దివ్య విలోకనంబులు ప్రభూ! పద్మావతీనాయకా! 72

ఉ. మాలికలిచ్చి నీకొకఁడు మానవదుర్లభమైనవిత్తమున్
మేలి యమోఘభోగములు మేదురసౌధ విమానపంక్తులన్
జాలఁగఁబొందె నామధుర సర్వము నీయనుకంపఁగాదె? యో
కాళియభోగిభోగమణి కాంతివిభాసిత వేంకటేశ్వరా! 73

శా. పత్రంబొక్కటి నీకునిచ్చి జనముల్ ప్రాపింతు రారామముల్
ఛత్రంబుల్ కడుసౌధరాజమణులుం జాతుర్య యోషావళుల్
చిత్రవ్రాతము నిట్టిముగ్ధజనునిం జింతింతు నిన్నొక్కనిన్
ధాత్రి న్నీసరిదాతనెన్నఁగలరే? తర్కింప శేషాద్రిపా! 74

ఉ. దాతవునీవె తల్లియును భ్రాతవునీవె సమస్తబాంధవ
వ్రాతమునీవె యా ప్రజనవారమునీవె సఖుండవీవె వి
ఖ్యాతియునీవె తాతయును గర్తవునీవె ఘనంబునీవె యీ
చేతన రాజికీవసుధఁ జిన్మయ శేషనగాధిపాలనా! 75

ఉ. వాసములేనియట్టి నరువైఖరిఁ జేరితి వా కువిందు నా
వాసము వస్త్రరాజికయి స్వర్ణమయాంబరధారివయ్యు నా
భాసములైన వేషముల పద్ధతిగాక ధరింపనేర్తువే?
నేసినవస్త్రముల్ ముదిత నీలసుకాయ! వృషాచలేశ్వరా! 76

ఉ. వాసములిచ్చి నీకుఁగడుపామరుఁడైన కువిందుఁడొందెఁ దా
భాసురవేశ్మముల్ మణులభామల భూముల హేమసంతతుల్
దాసుల ధాన్యరాసులను దల్పములన్ మరిస్వర్ణఖట్వముల్
మోసములేని సత్పథము భోగికులేశ! మహీధ్రపాలనా! 77

Scanned with CamScanner

నీదు సంగతిఁ గనిపెట్టి నిఖిలజనులు
తే. చేరుచుండిరి సుఖపుగఁ జెంతకెపుడు
సుంతయొసఁగిన వచ్చుఁగొండంతయంచు 78
శేషనగవాస! పద్మేశ! శ్రీనివాస!

సీ. పత్రంబు నీకిచ్చి. పడతియొక్కతె ధాత్రి.
సధికమౌ సంతోషమధిగమించెఁ
గుసుమమొక్కటియిచ్చి కుంభీంద్రుఁడత్యార్తిఁ
బాసి చరించెనిష్పాపుఁడగుచు
ఫలమొక్కటిచ్చినభామిని ప్రాపించె
రమ్యయోగులు నందరాని పథము
దోసెఁడు జలమును బోసి రాజేంద్రుఁడౌ
రంతిదేవుండొందె రమ్యగతిని

తే. సుంతనొందియునిత్తువు నెంతయైనఁ
గొప్పకొంచెము లెక్కిఁగెదు గుణములేదు
హెచ్చులేగాని "వేదావ" మచ్చుపడఁగ 79
దందశూకధరేశ! పద్మావతీశ!

సీ. దోసెఁడుగంధంబుఁ బూసినలేమ నీ
సర్వస్వదానంబు సంగ్రహించెఁ
బిడికెఁడడుకులు నీకిడిన భూసురుఁడుత్త
రాశాధిపునకంటె నధికుఁడయ్యె
నిసుక సేతువుమీఁద నిడిన చిక్రోడంబు
త్వత్కృపాపాత్రమై ప్రతిభఁగాంచె
వాక్యముల్ ధాటిగ వచియించి పౌలస్త్యుఁ
డగువిభీషణుడందె నసురరాజ్య

Scanned with CamScanner

తే. మేమి యిచ్చిరి? వీరు నీసేమమరసి
యెఱుఁగనేరవు సుంతయు నిందిరేశ!
మాయదెలియదు నీకు నీ మాటనిజము
శేషనగవాస! పద్మేశ! శ్రీనివాస! 80

సీ. క్రూరాపరాధంబుఁ గోరిజేసినయట్టి
చిరజీవి దైత్యు రక్షించినావు
నిన్ను దూషించుచు నీవారిఁదిట్టెడు
శిశుపాలుమోక్షంబుఁ జేర్చినావు
ఘోరహింసలఁజేసి గూలిన యల యజా
మిళనామధేయుఁ బ్రేమించినావు
నరమాంసజగ్ధియై పరువడిఁజెవులకు
ఘంటఁగట్టిన దైత్యుఁగాచినావు

తే. పాపమే రక్షణకు నాలవాలమయ్యె
దోషి నెఱుఁగవు మరియు నిర్దోషినెఱుఁగ
విట్టి ముగ్ధుండవయ్య! నీవెంచిచూడ
విశ్వలోకేశ! తిరుమలవేంకటేశ! 81

సీ. పరమపావనుని నిన్ బలుకనివానికి
నారోగ్యమిత్తు వత్యధికముగను
నీకు నెప్పుడు నొక రూకనియ్యనివాని
కైశ్వర్యమొడగూర్తు వలరియెంతొ
దేవుండు లేడని తిరిగి వాదించెడు
నరున కాయువునిచ్చి మరియుఁ బ్రోఁతు
వండజయాన! నీ దండకుఁజేరని
మూర్ఖులకిత్తువు భోగనివహ

Scanned with CamScanner

తే. మేమిపనులయ్య? నీచేత లెంచిచూడ
మంచినవనిదోఁపఁగ లేదు మాకు నిజము
గొప్పవాఁడవునైనఁబో! కువలయాక్ష!
విశ్వలోకేశ! తిరుమల వేంకటేశ! 82

సీ. దానంబుఁజేయుచుఁ దనరెడుదాతకుఁ
గల్పించుచుందువు కష్టదశల
నామ్నాయవర్గంబు లధ్యయనమొనర్చు
వానికి జడతను బూనియిత్తు
వధిక విద్వాంసుఁడై యలరెడువానికి
దారిద్ర్యబాధ నెంతయునుగూర్తు
వతిరథుఁడగువాని వితతకష్టంబుల
పాల్జేసి దేశాలఁ బంపుచుందు

తే. విట్టివింతలఁజేయుదు పట్టుదలను
మాయయో? లేక వీరి కర్మంబుఫలమొ?
తెలియరాదాయె మాకిది దివ్యతేజ!
శేషనగవాస! పద్మేశ! శ్రీనివాస! 83

తే. ధర్మమనఁగను వేరుగా ధాత్రిలేద
ధర్మమనఁగను లేదిది తథ్యమరయ
నీదుమనసునకెక్కిన దేదియైన
ధర్మమైచెల్లునయ్య! పద్మావృదీశ! 84

తే. విష్ణురాతునిఁ బ్రతికించు వేళయందు
శపథమొనరించితివి బ్రహ్మచారిననుచు
నెట్లు నమ్ముదురయ్య! మఱెట్లు బ్రతికె?
చిత్రమింతయు సర్వేంద్ర గోత్రనాథ! 85

Scanned with CamScanner

సీ. బాల్యమందున గొల్లపల్లెయందున వేల
యంగనామణులతో నాడినావు
పదియువర్షంబుల ప్రాయంబునందున
మేనత్తతోఁగూడి మెలఁగినావు
వయసునందున నష్టవామాక్షులనుగూడి
యధికమౌ భోగంబు లందినావు
పిమ్మట పదియాఱువేల భామలతోడ
ద్వారకావతియందుజేరినాడ

తే. వట్టి నీవెట్లు బ్రహ్మచర్యాధికుండ?
ననుచు మాటాడితి వికెట్లుమనియె శిశువు?
నీదుమాటలె జగమున నిజము లరయ
విశ్వలోకేశ! తిరుమల వేంకటేశ! 86

ఉ. ఏ విధి సంచరించిన మరేగతిఁబల్కిన నీకె చెల్లునో
శ్రీవర యిట్లుబల్కితివి చేసిన రీతిమఱొక్కటాయె నీ
కీ విధి చెల్లునయ్య? యని యెవ్వఁడు పల్కఁగశక్తియుక్తుఁడౌ
నీ వనజాసనాండముల కీశుఁడవీవె వృషాచలేశ్వరా! 87

మ. ఖలుఁడౌ బాణునిఁగావఁగా మదినిసంకల్పించినీమీఁది కా
యలికాక్షుండరుదెంచి యుద్ధమునకై యాబోఁతుపై స్తబ్ధుడై
సొలయందేహము వెండిలేచి మిగులన్ స్తోత్రంబుగావించె నీ
వలుగం లోకమునందునెవ్వఁడెదురౌ? హర్యద్రిప శ్రీహరీ! 88

ఉ. ధాతను భీమునిం గులిశధారిని గోవులదాఁచ భక్తునిన్
వీతభయాత్ముఁజేయఁ బరివృష్టినిముంపఁగ శిక్షఁజేసి తా
చేతమునందు నీ వటులుఁజేటును బొందక యుండనేర్చునే?
భూతములందు నొక్కఁడును? భోగికులేశ! మహీధ్రనాయకా! 89

Scanned with CamScanner

మ. సకలారాధ్యునినిన్ను గోరి యమరుల్ జన్మింపుమంచీభువిం
వికలజ్ఞానత గోపకుండవనుచున్ విన్నాణమున్వీడి నిన్
సుకరుంగాఁగఁదలంచి చేసిరిగదా చోద్యంబులౌ కార్యముల్
వికటాటోపులఁ జెప్పనేల? నరులన్ విశ్వేశ! శేషాద్రిపా! 90

చ. నరులనుగాని కిన్నరుల నాగులఁగాని ఖగాదులందునన్
గరుడులఁగాని తాపసులగాని ధురీణులఁగాని నీ దయా
గురుసురదీర్ఘికావళులు కూర్మిని నెవ్వరిముంచునట్టి వా
రెఱుఁగుదురయ్య! నిన్నుఁ బరమేశునిఁగాఁగ వృషాచలేశ్వరా! 91

చ. ఘనులమటంచు దుష్టులకుఁగానక కోరినవెల్ల నిచ్చి వే
వనటనుగాంచ లోకములు వారణఁజేయఁగలేక దేవతల్
మనములఁగోరుచుంద్రునిను మాధవ! వారలకోర్కులన్నియున్
బనివడి దీర్చుచుందువటు పన్నగరాజ మహీధ్రనాయకా! 92

చ. ఇతర నిలింపబృందములు నిత్తురు కోరినవెల్ల నప్పుడే
కుతుకమువీఱునొంది యవికోర్కి భుజింపఁగఁబూనినంతటన్
వితథములైనశించుఁ గడువేగమ యజ్ఞులు దీనిఁగానకే
సతతముఁగొల్తురాసురల సర్పకులేశ! మహీధ్రనాయకా! 93

ఉ. అంతముతోడనుండుఁ గమలాసనుఁడాదిగ దేవతావరుల్
పంతముతోడ నిచ్చునవి భక్తులకెల్లను నీవరంబు కొం
డంతయి వింతయై నిఖిలహర్షదమై యఖిలేశ మోక్షప
ర్యంతము నిచ్చుభేదమిది యాశుగజర్గి మహీధ్రనాయకా! 94

శా. అత్యల్పంబగు కాలమే గొలువఁగా నానందబద్ధాత్ములై
నిత్యానిత్యములెవ్వియో యెఱుఁగకే నేర్పొప్పఁగానిత్తురా
సత్యాధీశ శివాదిదేవతలు నో సర్వేశ! నీవన్నిటన్
వ్యత్యాంసబులఁ జేయఁజూడరుగదా! పద్మావతీనాయకా! 95

చ. ధనమునొసంగినన్ గులము ధాన్యములిచ్చిన భూమియిచ్చినం
దనయులనిచ్చినన్సగుణ దారల నిచ్చిన రాజ్యమిచ్చినన్
ఘనములనిచ్చినన్ ముదము గౌరవమిచ్చిన నేమియిచ్చినం
బనిగొని నీవె యీయవలె పన్నగరాజ మహీధ్రనాయకా! 96

ఉ. వానరభర్త కిచ్చితివి పాండుతనూజులకిచ్చితీవె యు
త్తాన పదప్రసూనునకు దానవులైన బలీంద్రకేకసీ
సూనులకిచ్చితీవె భువి శోభన రాజ్యములెన్న భూమియున్
శ్రీ నలినాక్షి జాయలయి చేరుటగాదె! వృషాచలేశ్వరా 97

క. వేధోండ నివహనాయక!
యాధివ్యాధ్యాదిహరణ! యహిగిరి నిలయా!
రాధారమణీనాథా!
పాథోధి ప్రబల నిలయ! పన్నగతల్పా! 98

ఉత్సాహము కనకచేల! ఘన కుచేలకాంక్షిత పదాబ్జ! దృ
గ్వనజగర్భ! జంభభేదివంద్య! రమ్యపాద! శ్రీ
వనజనాభ! హతమదేభ! వారిదాభ! దైత్య జీ
వనదధూత మాతరిశ్వ! పన్నగాద్రి నాయకా! 99

శ్రీ శేషనగేశస్తవము

తృతీయాశ్వాసము

కం. అగణిత సుగుణాంబునిధీ!
ఖగవాహన! త్రిభువనైక కారణరూపా!
విగలిత పాపసమూహా!
నగరీకృతశరధి! భుజగనగనాథహరీ! 1

ఉ. వేదగణాదికర్తవని వేఱుగఁజెప్పఁగనేల? సోమకుం
డాదియుగంబునందుఁ జతురానను వంచనఁజేసి నీరధిన్
ఖేదముఁబొందగాశ్రుతలఁ గ్లేదమునొందఁగజేయఁ జేఁపరూ
పాదటఁదాల్చి ప్రోచితిగదా! యటు వాని వృషాచలేశ్వరా! 2

చ. తురగమయాననుండవయి తోయధిఁగ్రుంగిన వేదరాశి నా
దరమునఁ బ్రోచి వేధకిడి దైత్యుని సోమకుఁ జంపి లోకముల్
స్థిరముగఁ జేయనుంచితివి జీవులయందున నట్టివాని నా
శరవరు నెట్లు చేసితివి సర్వము చిత్రము వేంకటేశ్వరా! 3

మ. విలయాంభోధిమునింగి దైత్యుఁడుకడున్ విన్నాణమున్ జూపనా
సలిలంబందున నున్నవాని నిఁక నేచందానఁ గన్గొంటివో?
బలసారంబున నీకు మించి యతఁడే ప్రౌఢుండుఁగాఁ దోఁచెనో?
జలజాక్షా! యతనిన్ హరించితివా యేచందాన? శేషాద్రిపా! 4

శా. జంతుస్తోమము మోయుచున్న జగతిం జాతుర్యమేపారఁగా
సంతోషంబునఁ జుట్టినట్టి ఖలునిన్ సాధింపఁగానెంచి నాఁ
డెంతోవేడ్క వరాహరూపివయితే యీశా! భువంబంత నీ
దంతాగ్రంబున బంతివోలె నిలుపం దర్వీకరాద్రిప్రభూ! 5

Scanned with CamScanner

సీ. ఖురపుటాహతి సప్తకూలంకషాంభస్సు
కలగుండుసెంది పంకిలముగాఁగ
దంతవిక్షేపణోద్ధత వాఃకరణంబులు
బ్రహ్మాండభాండంబు బ్రద్దలింప
ఘ్రాణనిరత మహాగంధవాహధ్వాన
మాకాశమెల్లను నాక్రమింపఁ
దుండస్థలోద్ఘూత చండఘుర్ఘురరావ
మాశాకటంబుల నవఘళింప

నాది వారాహరూపంబు నవధరించి
సంచరించితి లయకాల జలధియందు
సృష్టికాద్యుండవని వేరె చెప్పనేల?
దండశూకధరేశ! పద్మావతీశ! 6

శా. పాదాగ్రంబులబెట్టుద్రొక్కిఖలుఁడౌభర్మాక్షుదైత్యున్వడిన్
మేదోమాంసములెల్ల ఖండములుగామేనున్ విదారించుచున్
ఖేదంబొందఁగ నాడిరాసుల సటాకేశంబులం ద్రెంచుచున్
యాదోరాశినిఁ జంపినాఁడవుగదా! హర్యద్రిప శ్రీహరీ! 7

శా. ఘోరాకారుల దైత్యసత్తముల బల్కూర్మిందగం గూర్తువౌ
లే రెవ్వారులు వీరి నోర్వ నితరుల్ లేఖాదులం దెన్నఁగా
వీరిం గల్పనఁజేయ నాశమొగిఁ గల్పింపన్ సమర్థుండ నౌ
శూరశ్రేష్ఠుఁడనేనెయంచుఁ దెలుపన్ క్షోణిన్ వృషాగప్రభూ! 8

మ. జలజాతాసనుచే ననేకవరముల్ సాధించి యాదిత్యులం
బలగర్వంబున గెల్చి లోకసమితిం బాధించి శోధించి యా
ఖలుఁడౌ హాటకకశ్యపుండు సుతునిం గారింపఁగాఁజాలెనే
యిల నీ భక్తుల నేమిసేయుదురు? లోకేశా! వృషాగప్రభూ! 9

Scanned with CamScanner

సీ. దుష్టులౌ రాజులు దోశ్శక్తిఁజూపించి,
చెలువ ద్రౌపది నేమిజేసిరయ్య?
తాపసి కోపించి తనధాటిఁ జూపించి
యంబరీషున కేమియార్తి నినిచె?
భువనకంటకులైన పూర్వదేవులు లంకఁ
బవనపుత్రున కేమిబాధలిడిరి?
గోగ్రహణమునాఁడు కురురాజసంఘంబు
జిష్ణుపుత్రుని నేమిచేయఁగలిగె?

తే. వసుధయందున నీ దాసవరులఁగాంచి
పలుకరింపఁగ వశమె యెవ్వారికైన?
నీదు సామర్థ్య మట్టిది నీరజాక్ష!
విశ్వలోకేశ! తిరుమల వేంకటేశ! 10

సీ. కాదంబరీపాన కలుషమానసుఁడైన
బ్రహ్మఘ్నదోష సంప్రాప్తుఁడైన
గోవధగావించు ఘోరపాతకియైన
శ్వానముందినెడు నిషాదుడైన
తల్లిదండ్రుల దిట్టు ధర్మదూషకుఁడైన
వేదముల్ నిందించు వెఱ్ఱియైన
ననృతంబు భాషించు నధమాధముండైన
పరహింసగావించు పాపియైన

తే. నీదు పదపద్మములు మదిఁబాదుకొలిపి
యక్కజంబుగ నీ నామ మొక్కసారి
దలఁపఁ బాపంబులన్నియు దగ్ధమగును
దందశూక ధరేశ! పద్మాహృదీశ! 11

Scanned with CamScanner

సీ. షట్కర్మనిరతుఁడౌ సద్బ్రాహ్మణుండైన
శాస్త్రముల్ వల్లించు చతురుఁడైన
పర్ణభక్షకుఁడగు వరమునీంద్రుండైన
దాన మెప్పుడుఁజేయు దాతయైన
నుపవాస నిరతుఁడౌ యోగీశ్వరుండైన
భూరి ధర్మాత్ముఁడౌ భూపుఁడైన
మంచినే గావించు మస్కరియైనను
గర్మముల్ జెప్పెడు గణకుఁడైన

తే. వసుధ నీ భక్తి లేనిచో వ్యర్థులయ్య!
శకట హాలికాది సాధనచయముగలిగి
కేవలము వృష్టిలేనట్టి కృషియుఁ బోలె
దందశూకధరేశ! పద్మావతీశ! 12

ఉ. పంచశరద్వయస్కుఁడగు బాలుఁడునిన్నఖిలేశ్వరున్ మహో
దంచిత భక్తిచేతనెగదా! గఱిగించి యపారతుష్టియున్
గొంచెముఁగాని రాజ్యమును గొప్పపదంబు నుదారవంశ్యులన్
మంచియశంబుఁగాంచెననుమానముఁదక్కి వృషాచలేశ్వరా! 13

ఉ. భక్తియె గొప్పలోకమున భక్తియె దాసులపాలి కల్పమున్
భక్తియె భుక్తిదాయకము భక్తియె మూలధనంబు జీవికిన్
భక్తియె ముక్తికారణము భక్తియె నిన్నుగనంగ మార్గమున్
భక్తియె నిత్యరక్షకము పన్నగరాజమహీధ్రనాయకా! 14

చ. సవములచేత నన్నుగనసాధ్యముఁగాదు ధనంజయా! పడిం
దినముల రాత్రులన్ శ్రుతులఁ దీరికగల్గి పఠించినందునన్
ద్రవిణము నెల్ల దానమిడఁదాదృశమే యిఁక భక్తియొక్కటే
భవమును బాపి చూపునని పల్కవె? గీత వృషాచలేశ్వరా! 15

Scanned with CamScanner

మ. గురులంజంపి యబద్ధమాడి సమితిం గుంతీసుతుల్ బొందిరే
దురితంబున్? గడుపుణ్యులంచుఁ బొగడెంతో గాంతురీనాటికే
సరవింజూడఁ ద్వదీయ భక్తులకు నాశంబెప్డులే దీవె యా
కరణిం బల్కితిగాదె! గీతను భువిన్ గాకోదరాద్రిప్రభూ! 16

సీ. భక్తిచేతనెగదా పద్మనాయకుఁడు, శ్రీ
వైకుంఠమున్ లేపి వరుసఁదెచ్చె
భక్తిచేతనెగదా బలిసార్వభౌముండు
ప్రతిహారు నినుజేసి వాసిఁగాంచె
భక్తిచేతనెగదా ప్లవకుల శ్రేష్ఠుండు
భషకమాంసముఁజేసె భక్ష్యముగను
భక్తిచేతనెగదా పార్థుండు రథమునఁ
గాలితాఁపునఁజెప్ప గలవిషయము!

తే. భక్తిచే ద్రౌపదియు మహాభాగయయ్యె
భక్తిచే సుమ్ముముక్తి సత్పథము జగతి
భక్తివశుఁడవు సర్వేశ! పరమ పురుష!
దండశూకధరేశ! పద్మావతీశ! 17

సీ. శయనించియున్న నిన్ జండశాసనమున
సగములేపెను భక్తిసారయోగి
వేలాయుధంబున వెఱపించి మంత్రంబుఁ
గైకొనియెను బరకాలమౌని
శిష్యునిఁగా నినుజేసి సత్కారముల్
గాంచెగా మును భాష్యకారగురుఁడు
విడిచిపుచ్చినయట్టి విరులచే నతిప్రేమ
పుత్తెంచెగా విష్ణుచిత్తతనయ

Scanned with CamScanner

తే. వరుస నన్నిటిఁజూడంగ వాంఛతోడ
వెఱచినాడవె వీరికి? వేదవేద్య!
భక్తిచేతనెగాదె యీపగిదిచూడ
విశ్వలోకేశ! తిరుమల వేంకటేశ! 18

సీ. గోపన్నకొఱకునై కోట్లహిరణ్యంబు
నర్పించినాడ వా యవనపతికి
మునుపుసేనానావిబూని రక్షింపఁగ
క్షురకర్మమునుగూడ నెఱపినావు
తులసిదాసునకునై దొంగలతోఁబాటు
తెలవాఱునందాకఁ దిరిగినావు
నరసింహమేధను గరమొప్పు రక్షింప
మహిని దాల్చితివి శ్యామళసవేష

తే. మిట్టి పనులెన్ని జేసితో పట్టుదలను
గోరి వానినన్నిటినెన్న నేరితరము?
భక్తులగుటనుగాదె యో పరమపురుష!
దందశూకధరేశ! పద్మావతీశ! 19

సీ. కులగౌరవంబును గోరి పాటింపవు
సాక్ష్యంబు దీనికి శబరిసుమ్ము
జాతిభేదంబును స్వామి! పాటింపవు
సాక్ష్యంబు దీనికి శకునమయ్య!
ధనమును బాటింప వనిశంబు మనమున
సాక్ష్యంబు దీనికి జ్ఞాని విదురుఁ
డాచారమును మది నంతగా నెన్నవు
సాక్ష్యంబు దీనికి సాధ్వికృష్ణ

తే. హృదయమను పాడుగుహలోన నింతయైన
భక్తియొక్కటియున్నదా? పాయకనుచుఁ
జూతువేగాని యన్యంబుఁ జూడఁబోవు
శేషనగవాస! పద్మేశ! శ్రీనివాస! 20

మ. బలిమిన్ లోకములం జయించి సురలం బంధించి యజ్ఞంబుకే
వలమున్ వేడుకఁజేయుచున్న బలినిన్ వాంఛించిపాదత్రయం
బెలమిన్ విశ్వముగొల్చినట్టి భువనాధీశుండ వీవేకదా
జలజాతప్రభవాదిసన్నుతివిభూ! సర్వేంద్రగోత్రాధిపా! 21

చ. జగముల కీశ్వరుండవయి జంతువితానమునెల్లఁ బ్రోచుచున్
నిగమమయుండవై వెలయు నీవొకదైత్యుని దేహియంచు వే
ఱు గతియులేనివానివగ రూఢిగగోరితి వేమిలేక? నీ
కగణితసత్యభాష! విహగాధిపవాహ! వృషాచలేశ్వరా! 22

ఉ. వక్షమునందు లక్ష్మిఁగలవాఁడవు నీవొక మార్గణుండవై
యక్షయపాత్ర చేతఁగొని యాచనవృత్తికిఁబూనినావె? యీ
భిక్షుకవేషమంత మునుఁ బ్రీతినొసంగిన దానికైకదా!
శిక్షితదుష్టభక్తజనసేవిత శేషమహీధ్రనాయకా! 23

సీ. బ్రహ్మాండములనెల్ల భరియించు నీవెట్టు
లదితి గర్భమునందు నలరినావొ?
లక్ష్మీధవుఁడవయ్యు లలి బలీంద్రునినెట్లు
కడఁక దేహియటంచు నడిగినావొ?
యఖిలప్రపంచంబు నరసిబ్రోచెడు నీవు
మూడడుగ్గు లేవిధి వేడినావొ?
వేదాంతములచేత వినుతిఁగాంచెడు నీవు
పొరి దైత్యు నేరీతిఁ బొగడినావొ?

Scanned with CamScanner

తే. బాలకుఁడవయ్యు లోకముల్ బాళిమీఱఁ
గొలిచినాడవొ? నీవెట్లు జలజనేత్ర!
నీకె చెల్లునుగా కిట్లు నేర్తురెవరు?
వృషభనగవాస! పద్మేశ! వేంకటేశ! 24

సీ. శ్రీశుండవును సర్వశేషిని నిన్నొక
యర్థిగా వేగమ నమరఁజేసి
యాదితేయులకెల్ల నమృతంబు పంచిన
త్వత్పంచశాఖి నధఃకరించి
పారికాంక్షులకెల్ల ఫలముల నిచ్చు నీ
యమృతవాక్కును దేహి యనఁగజేసి
వేదాంతములయందు వెలసెడు నీపద
కమలంబులకు పనిఁ గలుఁగజేసి

తే. నీకు దానంబునీయఁగా నేర్చినట్టి
బలినిఁబోలు వదాన్యుండు గలఁడె భువిని?
యతఁడె యధికుఁడు నధికుండు నధికతముఁడు
శేషనగవాస! పద్మేశ! శ్రీనివాస! 25

సీ. వామనాకృతిగల్గి వనజజాండముఁ గొల్చి
నట్టి యాచకుఁడున్నె యవనియందు?
నడిగినదానికి నధికంబుగానిత్తుఁ
దాత! గోరుమ యను దాతగలఁడె?
మూడడుగు లడిగి యీ ముల్లోకములనెల్ల
నాక్రమించినయట్టి యర్థిగలఁడె?
యీ దానమునఁబోవు నెల్ల సంపదలని
తెలిసి యిచ్చినయట్టి దిట్టగలఁడె?

Scanned with CamScanner

తే. యాచకులయందు నధికుండవయ్య! నీవు
దాతలందును బలియ పో! ధన్యతముండు
నాల్గుయుగముల మీకు నున్నారె సాటి?
విగతభవపాశ! తిరుమల వేంకటేశ! 26

సీ. వ్యాకృతిశాస్త్రంబు వల్లెవేసినవారి
ధాతువాదమునందు దటిమివైచి
నైయాయికులనెల్ల వాయెత్తకుండంగ
లక్షణంబున వారి శిక్షఁజేసి
వైశేషికులతోడ వాగ్యుద్ధ మొనరించి
సామాన్యమున వారిఁ జక్కఁజేసి
ఛందస్సుఁ జదివిన చతురుల వీక్షించి
ప్రస్తారమున వారిఁగుస్తరించి

గీ. గణకవర్గంబులను జోలఁగాసిఁజేసి
బలి సభామధ్యమునఁ గడు వెలిఁగినావు
రాయణుండ వౌట జగమున రానిదున్నె
దందశూకధరేశ! పద్మావతీశ!

సీ. వేదండముల వేనవేలుదాల్చెడు నీకుఁ 27
జెలగి యీ యండంబుఁ గొలుచుటెంత?
విశ్వమంతయు నిండి వెలిఁగెడు నీవొక
బ్రహ్మాండమున నిండి ప్రబలుటెంత?
భవమున జీవుల బంధించు నీకొగిఁ
దొడరి యా బలిదైత్యుఁ ద్రొక్కుటెంత?
యక్షరరూపివై యలరెడు నీకిల
శాస్త్రప్రసంగంబు సలుపుటెంత?

Scanned with CamScanner

తే. విధిశివాదుల మాయచే వేసరించు
దివ్యచేష్టలుగల నీకు దితిజుమోస
పుచ్చుటనఁ గనువింతయే? భోగిశయన
విగతభవపాశ! తిరుమల వేంకటేశ! 28

మ. ధనమున్ సర్వము ధారవోసి బలిదైత్యశ్రేష్ఠుఁ డాహా! సనం
దనదేవాదుల కందరాని విభునిన్ ద్వారంబునం దెప్పుడున్
మనగంజేసిభవన్ముఖాంబుజము ప్రేమన్నిత్యమున్ జూచుచున్
ఘనమౌ శ్రేయముఁగాంచెజన్మయదెపో! కాకోదరాద్రిప్రభూ! 29

ఉ. వేత్రముఁదాల్చి మంచిదగు వేష్టనమున్ ధరియించివర్మమున్
గాత్రమునందు దొడ్గి ఘనకాంచనపట్టము దాల్చి పాదుకల్
పాత్రముగాఁగ వేసి నరపాలురనెల్ల దొలంగఁజేయుచున్
జైత్రుఁడవై బలీంద్రు సభ సన్నిధిఁగాచితె! వేంకటేశ్వరా! 30

చ. అసురవరండముల్ దివిజు లద్రిని నంబుధిఁద్రోయ భారమై
ససిచెడి లోనఁగ్రుంగసుర సంఘము నిన్ను నుతింపఁగూర్మమై
మసలక లేపి మందరము మంథముగా ధరియించి దేవతా
విసరము సన్నుతింప సుధ వేడుకనిచ్చితె? వేంకటేశ్వరా! 31

కం. తొంబది తొమ్మిదికోటులు
సంబరమున లేపలేని క్ష్మాధర మొకహ
స్తంబునలేపి ఖగేంద్రు శి
రంబున నిడినాఁడవయ్య! రాజీవాక్షా! 32

కం. దండిగల దివిజరాక్షస
తండంబులు నిలిచి త్రిప్పిధరమున్ నీపైఁ
గండూతిఁ బాపజాలిరె
యండజపతి తురగ! వేంకటాచలనాథా! 33

కం. మోహింపఁజేసి దితిజ స
మూహంబును, సుధను యజ్ఞభుక్కుల కిడవే?
యూహంబు లందు టరుదే
పాహి యనం గలుగు భక్తపాళి రమేశా! 34

కం. పెక్కురుగలిగియు బలమున
నెక్కువయయ్యును సురారులేఁచిరె? కలిలో
నిక్కము నీడింగరులకుఁ
దక్కువసుమ్మెట్టివారు తార్క్ష్యతురంగా! 35

సీ. పూర్ణేందుబింబంబు పొలుపును దెగనాడి
మోహింపఁజేయు నీ మొగముఁజూచి
ప్రాలంబికాదుల ప్రభలచే రేఖల
తవణిల్లు నీదు కంఠంబుఁజూచి
రశనాది భూషలరమ్యమై యబ్రమై
తనరారు నీదు మధ్యమునుజూచి
కమఠనిభంబులై కటక యుక్తంబులై
కొమరరారు నీదు పాదములఁజూచి

యింపుదళుకొత్తు నీదు పాలిండ్లఁజూచి
శుక్రశిష్యులు మోహింపఁ జొచ్చిరయ్య!
చేరి నీమాయఁ దెలియంగ నేరితరము?
దందశూకధరేశ పద్మావతీశ! 36

కం. భామిని వేషముఁ దాల్చినఁ
గామించియు శివుఁడు చాలగగ్గోలొందెన్
పామరులగు రాక్షసులన
స్వామీ! నీకెంతవారు? సర్పధరేశా! 37

Scanned with CamScanner

ఉ. ఒక్కడు మోసగింపమదినూకొనె నొక్కఁడు దుష్టరక్షకై
మక్కువధీకొనందొడఁగెమాన్యుఁడొకండుఘనప్రయోగమున్
మిక్కిలిఁజేసె, నిన్నుఁగృతిమించిన త్రాహియనంగఁబూనిరీ
ఫక్కియు నీదుమాయయని భావనసేసెద వేంకటేశ్వరా! 38

సీ. మును దితిజులు నిన్ను మోహించినందున
ఫలముఁగానక చాలవ్యర్థులైరి
దండకరాక్షసి తమి నిన్ను మోహింప
మఱుజన్మమున దాని మమతదీఱె
న్యాయంబుఁదప్పక యతివ కోరెనుగాన
దానికోరికఁ దీర్పఁబూనినావు
జీవులకును నీకుఁ జెలగి భార్యాభర్తృ
న్యాయమున్నదిగాన రోయకపుడు
కోరినకోరిక కూర్మిఁ దీర్చితివయ్య!
దైతేయులెల్లను ధర్మమేది

తే. పలుకరానట్టి పలుకులు పలికినందు
వలన వారికి ఫలమును స్వల్పమయ్యె
నెవరికర్మంబుఁ దప్పింప నెవరు ప్రభులు?
శేషనగవాస! పద్మేశ! శ్రీనివాస! 39

మ. బలుఁడౌ రావణుఁ డీజగంబుల వడిన్ బాధింపఁగా దేవతా
కులముల్ స్తోత్రముఁజేయదాశరథివైక్షోణిందగన్దోఁచి యా
ఖలువంశంబును నీఱుఁజేసి మునిసత్కారంబులబొంది యా
కులతంబాపిన వాఁడవీవెగద! యో గూఢాంఘ్రిగోత్రాధిపా! 40

Scanned with CamScanner

శా. దుష్టక్షత్రియయుక్తమైన జగతీదోషంబునుం బాపఁగా
నష్టంబొందిన ధర్మమున్ నిలుప విన్నాణంబుతో మస్కరి
స్రష్టృండౌ జమదగ్నికిన్ సుతుఁడవై జన్మించి లోకంబునన్
శిష్టాచారము నిల్పితీవెగద! యో శేషాచలాధిప్రభూ! 41

చ. పరశుధరుండవై వెలయు భార్గవరాముని నిన్నుఁగాంచి వే
ధరణిపులెల్ల గాజులనుదాలిచి చీరలుగట్టి భూములన్
దిరుగునుండిరయ్య! సితనీరజనేత్ర! సురాసురాదులం
దరయఁగ నీకు నెవ్వఁడెదురై మనియుండు? వృషాచలేశ్వరా! 42

చ. హలమున లేపి సర్వమగు హస్తిపురంబును జాహ్నవీనదీ
జలములఁ ద్రోయఁబూననలశంతనుసూను సుయోధనాదులౌ
నిలపతులెల్లవేడ పురి నెప్పటియట్లులె యుంచినట్టి యా
బలుఁడవు నీవె శార్ఙ్గధర! పన్నగరాజ మహీధ్రనాయకా! 43

చ. ముసలము నొక్క హస్తమున భూరిహలంబుమరొక్క చేతితో
మసలకఁ దాల్చివచ్చు నినుమార్కొన దైత్యభుజంగదేవతా
వసుగరుడాహి యక్షనరపన్నగకిన్నర సిద్ధసాధ్యులం
దు సముఁడుగల్గునే జగతి? దోషవిదూర! వృషాచలేశ్వరా! 44

క. పాషండుల శిక్షింపను
దోషాచరసంఘములకు దుఃఖముఁ బెంపన్
దోషంబుఁబాప బుద్ధ సు
వేషంబును దాల్చితీవె వేంకటనిలయా! 45

తే. కలికి రూపంబుఁదాల్చి యాఖిలజనములఁ
జీల్చిచెండాడి ధర్మంబుఁజేర్చ భువిని
వెలయుదువు నీవు కలియుగవేళయందు
విశ్వలోకేశ! తిరుమల వేంకటేశ! 46

Scanned with CamScanner

సీ. ఆర్తరక్షకుఁడవీవంచుఁ జేరెదమన్న
వేంకటాచలమందు వెలసినావు
ఏడుకొండలనైన నెక్కి చూచెదమన్న
బిచ్చగాళ్లను గాపుఁబెట్టినావు
వారినెట్టులో దాటి వచ్చెదమన్నచోఁ
బోలీసులను జుట్టుఁ బొదిగినావు
బలవంతమున వారిబారిఁదప్పియు జేర
వేల తిరస్క్రియల్ వేసినావు

తే. ఇన్ని కాపులఁబెట్టితి వెందుకయ్య?
యెట్లు జేరఁగఁజెల్లు? మఱెట్లు చూడ
గల్గు! నిను మాకు గనులారఁ గాఁక్షదీర
విశ్వలోకేశ! తిరుమల వేంకటేశ!

47

సీ. బాధలెన్నోబడి పర్వతంబెక్కంగ
బస దొరకక చాల బాధగలుగు
నా బాధలను బాసి యాలయంబునుజేర
నాస్తిదర్శన మిప్పుడనిరి జనులు
ధర్మదర్శనమంచు తందరగానిరాగ
'క్యూశిష్ట' మొక టొడఁగూర్చినావు
దానియందునఁజేరి దర్శింతమన్నచో
బహుదూరమయ్యె నీ భవ్యగృహము

తే. చేరి యట్టులె నిను జూడఁగోరునంత
నెట్టుచుండిరి బయటికి నీదు భటులు
కాంక్షఁదీరఁగ జూడంగఁగలుగు టెట్లు?
శేషనగవాస! పద్మేశ! శ్రీనివాస!

48

Scanned with CamScanner

సీ. అర్చనయందు నిన్ననుభవించుదమన్న
నేదురూప్యములిచ్చి యేగవలయుఁ
బూలంగిసేవ నిన్ బూజింతమంటిమా!
క్రమముగా పదుమూడు కట్టవలయు
విశ్వరూపమునందు వీక్షింతమంటిమా!
కొంతద్రవ్యముఁ గట్టుకొనఁగవలయు
నుత్సవంబునుజేయ నూహింతమన్నచో
వేలద్రవ్యములేక వీలుపడదు

తే. బీదజనులకు ద్రవ్యంబు లేదుగాన
నెట్లు చూడంగనగు నిన్ను? నిందిరేశ! 49
ద్రవ్యహీనుల కగపడఁ దలఁపలేదె?
దందశూకధరేశ! పద్మావతీశ!

సీ. శ్రీశుండవంచు నీసేవకైవడిరాగ
వారినే యాచింపఁగోరినావు
ధనము సమర్పింపఁగనె వారి శిరముల
బోడులఁజేయింపఁ బూనినావు
రమ్యములౌ పాదరక్షలచే వారి
తలలపై మోదంగఁ దలఁచినావు
మతియున్నచో నీదు పరిచారకులఁ బంపి
కొంతద్రవ్యము లాగఁ గోరినావు

తే. సుంతరిక్థంబు లేదని జూచివారి
వెడలఁగొట్టెద వింటికి వేంకటేశ!
యిట్లుఁ జేసిన నీవెపో! యేడుగడయు 50
విశ్వలోకేశ! తిరుమల వేంకటేశ!

సీ. నీదు సత్రంబందు నెఱిజేర నచ్చటఁ
గూడ ద్రవ్యంబునే గోరినారు
శైలమెక్కఁగలేక శకటంబులనుగోర
కరము నీయకయె యెక్కంగఁజెల్ల
దెగువ తిర్పతికేగి యెలమిగృహంబద్ద
నచ్చటి యధికారి యదరిపడియె
నన్యగృహస్థుల యాలయంబుల కేగ
ననుకూలమగు స్థలం బమరదయ్యె

తే. నిట్టి వింతల నేమియు నెఱుఁగవయ్య?
భక్తజనులకుఁ దగినట్టి బసలనిచ్చి
బ్రోవుమంచును వేడెద భూరితేజ!
విశ్వలోకేశ! తిరుమల వేంకటేశ! 51

సీ. పులియోరఁ జేయింపఁ బూనిన ద్రవ్యంబు
కొంత గట్టకయున్నఁ గూడదయ్యె
చక్కెరపొంగలి మక్కువఁజేయింపఁ
గోరిన విత్తంబుఁ గూర్పవలయు
లడ్డుకంబులనీయ లలిఁబూని యున్నచో
పెక్కురొక్కము సమర్పింపవలయు
వడలను జేయింప వాంఛగల్గిన ధనం
బెక్కు వీయకయున్నఁ జక్కవడదు!

తే. నీవె తినుటకు నీయంగ నీరజాక్ష!
ధనము లేక గ్రహింపవేధర్మ? మయ్య!
పెక్కురీయంగ దినలేక పెట్టినావా?
శేషనగవాస! పద్మేశ! శ్రీనివాస! 52

సీ. కరిగిరివరదుఁడుఁ గాంక్షింపఁ దర్థంబు
నాదికేశవుఁ డిట్టులాసపడఁడు
పద్మనాభస్వామి సద్మమందున లేదు
శ్రీరంగనాథుండుఁ గోరఁడిట్లు
శార్ఙ్గపాణిస్వామి సాన్నిధ్యముననుండ
దాదినాథస్వామి యడుగఁడెపుడు
వటపత్రశాయియు వాంఛింపఁ డెన్నడు
భద్రాద్రియందును బడయఁడిట్లు!

తే. ద్రవ్యమంతయు లాగిన దైవమీవె
యంచుఁ జేరెదరయ్య! యీ యఖిలజనులు
బెట్టుపో లోకమందునఁ బట్టుగొమ్మ
దందశూకధరేశ! పద్మావతీశ! 53

సీ. మొదటిగాఁ దిరుపతిఁ బొడగాంచినంతనే
మనముల సంతుష్టి జననమొందు
నటుమీఁద శేషాద్రి నవలోకనముసేయ
దారిద్ర్యభవదోష తాపమడఁగుఁ
దరువాత వేంకట ధరమందుఁ బయనింప
నానందమధికమై యతిశయిల్లుఁ
బదపడి నీదివ్యభవ్యగోపురములఁ
దిలకింప విజ్ఞానదీప్తి యొదవు

తే. వెనుక నానందములకెల్ల వేశ్మమైన
నీదు రూపంబుఁజూడంగ నిఖిలదుఃఖ
సింధువులదాఁటి గాంతురు శ్రేయములను
శేషనగవాస! పద్మేశ! శ్రీనివాస! 54

Scanned with CamScanner

శా. గోవిందా! యని యుచ్చరించుచు జనుల్ కోలాహలోపేతులై
భావంబుల్ ముదమొంద శేషగిరిపైఁ బాదాతులై పోవ నా
రావంబున్ వినుచున్ జరించు మృగముల్ రమ్యంబులౌ పక్షులున్
గ్రావవ్రాతములెల్ల ధన్యతమముల్ కాకోదరాద్రి ప్రభూ! 55

సీ. వేంకటాచలమందు విహగంబనైనను
శ్రేయమంచనెఁ గులశేఖరుండు
శ్రీనివాసునియందుఁ జత్తంబు భక్తిరూ
పమునొందుఁగాకనె భాష్యకారు
లహిగిరినాధుండవని యెంచి శఠవైరి
ముమ్మారు పాడెఁబో మోదమంది
కలియుగంబునను వేంకటనాయకుఁడె దైవ
మని వచించిరి జ్ఞానులైనవారు

తే. రూకయొరులకు నీయక రూఢికెక్కు
లోలుపుండైన నీకిచ్చు వేలధనము
లెల్లవారికి నినుజూడ నిట్లగలుగు
దందశూకధరేశ! పద్మావతీశ! 56

ఉ. పొన్ను కొలంకులోసతము పూనిమునింగెడు మానవాళికిం
గ్రన్నన నెన్నగావశమె కల్మషముల్ హరియించునట్టి నీ
సన్నిధిఁగాక యేాపగిది శంబరమందు మునింగిననగటా!
యెన్నగలేని రోగముల నేడ్తెఱబొందరె? వేంకటేశ్వరా! 57

ఉ. సారవిహీనమై విగతసస్య సమృద్ధియు నైనయట్టి యా
ధారుణి నీవు నిల్చుటఁ గదా జనపాళి మహాధనంబు వి
స్తారమణీవితానముల సద్మములొందఁగఁగల్గె లేనిచోఁ
దీఱనియట్టి క్షామమను దేవత యాడదె? వేంకటేశ్వరా! 58

Scanned with CamScanner

సీ. నీదుసన్నిధికి రాగాఁ దలంచినయట్టి
వారమే వారంబు వనజనాభ!
నీ దేశమునుజూడ మోదంబుతో వచ్చు
కాలమే కాలంబు కనకచేల!
నీ పర్వతంబెక్క నిపుణతగల్గిన
పదములే పదములు పరమపురుష!
నీ సుప్రభాతంబు వాసి వినంగల్గు
శ్రవములే శ్రవములు సత్యభాష!

తే. కలిమి నినుఁ జూడఁగల్గిన కనులు కనులు
వరుస నిన్ను వచించెడు వాక్కు వాక్కు
భూరిగుణసింధు! నినుగోరు బుద్ధి బుద్ధి
విశ్వలోకేశ! తిరుమల వేంకటేశ! 59

సీ. కాంచనంబును జూడఁ గాంక్షగల్గినయట్టి
మనుజుండు నీగుడిఁ గనగవలయు
విరివిగా ద్రవ్యంబు వేడ్కఁ జూడఁగఁగోరు
నరుఁడు నీయాస్థాన మరయవలయు
బలుదేశవాసుల భాషలు వినగోరు
జనుఁడు నీకొండకుఁ జనఁగవలయు
మానవసంఘమున్ గానగోరెడువాడు
శేషాద్రిచెంతకుఁ జేరవలయు!

తే. దివ్యభోగంబులను నెప్డు తినఁగఁగోరు
మానవుఁడు నీదు సన్నిధి మనఁగవలయు
సేవజేసిన నీ సేవ జేయవలయు
శేషనగవాస! పద్మేశ! శ్రీనివాస! 60

Scanned with CamScanner

ఉ. ఎన్నియొ దివ్యదేశముల నేర్పడ వాసముఁజేసి చూచి, రా
కున్న జనంబు, తీవ్రతనుగోరి ధరించి మహీధ్రమందు బల్
చెన్నునవిల్చి శాసనముఁ జేసితివయ్యా! నరాళికెల్లరా,
మన్ననచెల్ల దెప్పుడును మందుల కీ యిల వేంకటేశ్వరా! 61

సీ. కర్మంబుఁజేసెడు కాలమందునుగూడ
క్రాపులఁ దీయని కలుషియైన
మితిలేని ప్రేమచే మీసాల నెప్పుడు
వడి ద్రిప్పుచుండెడువాఁడునైన!
సంపంగినూనెల సొంపునఁబూసి బల్
గిరజాలు దువ్వెడు నరుఁడునైన
దువ్వెన చేఁబూని తుష్టుఁడై దువ్వుచు
ముడి బాగుగా వేయు మూర్ఖుఁడైన

తే. నీదు సన్నిధి గొలిగించి నెగడుచుండు
సర్వలోకేశ! నీచండశాసనమునఁ
గాదె చేయుట లేకున్నఁగదపవశమె
విశ్వలోకేశ! తిరుమల వేంకటేశ! 62

సీ. నోటికి ముద్రలు వాటంబుగా వేసి
కోరి తిరుగువారు కొంతమంది
యార్ద్రవస్త్రంబుల ననువుగా మైఁదాల్చి
గోవింద! యను వారు కొంతమంది
హారిద్రచేలముల్ గారవంబునఁ బూని
గుడి దిరిగెడువారు కొంతమంది
కాళ్లబాహువుల సంకెళ్లను దగిలించి
కుంటుచుండెడువారు కొంతమంది

తే. ప్రొక్కుబడులను దిరిగెడు పెక్కుజనులు
గానబడుదురు నీ సన్నిధానమందు
యుష్మదాజ్ఞకు తిరుగున్నె? యుర్విలోన
శేషనగవాస! పద్మేశ! శ్రీనివాస! 63

సీ. దోసిళ్ల నిండుగాఁబోసి రొక్కంబును
గడువేడుకను వైచికదలువారు
పొలుపుగాఁ దమమెయి భూషణంబులు దీసి
సంతోషమున వేసి చనెడువారు
పసుపుగుడ్డలఁగట్టి పయిడిని రూకలఁ
దోషంబుతో వేసి తొలఁగువారు
పేటికల్ బట్టంగవేసి ధనంబును
మోదంబుతో విడిపోవువారుఁ

తే. గానబడుదురు నీ ధనాగారమందు
ధనముబోయిన జనులకుఁ దనరుబాధ
ప్రీతిగలుగుట నీయొద్దె విశ్వవినుత!
దందశూకధరేశ! పద్మావతీశ! 64

ఉ. భారతవర్షమందుఁగల పంచజనావళి నెన్ని చూడ నిన్
జేరనివారు లేరనుచుఁ జెప్పఁగవచ్చు నదెట్టులన్న నే
వారము జూచినన్ గుడికివచ్చు జనంబుల లెక్కసేయ నె
వ్వారికి శక్యమౌ? నిఖిలవాంఛితదాయక? వేంకటేశ్వరా! 65

సీ. శబ్దముల్ నీయందు జనియించుటను నీకు
రాయండనెడు ఖ్యాతి రహిజనించె
నారంబులకు నీవె కారణంబగుటచే
నారాయణాభిధానంబుగల్గె

విశ్వమయుండ వీవె యగుటచే నిల
విష్ణునామము నీకు విశదమయ్యె
నింద్రియంబులకెల్ల నీశుండవగుట హృ
షీకేశ నామంబుచెల్లె నీకు

తే. నజ భవాదుల కాధారుఁడగుట నీకు
కేశవుండను నామంబు కీర్తి కెక్కె
విశ్వకర్తవు నీవెపో! వేదవేద్య!
దందశూకధరేశ! పద్మాహృదీశ! 66

చ. అజుఁడవు నీవె శక్రుడును హైమవతీశుఁడు నీవె శ్రీదసూ
ర్యజులును నీవె మారుతమురాత్రికరుండును నీవె ధాత్రియున్
ద్రిజగతి నీవె పావకుఁడు తిగ్మమరీచియు నీవెపాశియున్
భుజగవరుండు నీవెగద! భోగికులేశ మహీధ్రనాయకా! 67

చ. దినములు నీవె పక్షములు దిక్కులు నీవె విదిక్కు లీవెపా
వనసవనంబు లీవె ఘనవారిధులీవె కొలంకులీవె స
ప్తనగనములీవె నిమ్నగలు వర్షమునీవె వనంబులీవె యీ
వనజభవాండ మీవెగద! పన్నగ రాజమహీధ్రనాయకా! 68

ఉ. వేదము లీవె శాస్త్రములు వేగము నీవె ధనంబు నీవె స
మ్మోదమునీవె నాదమును మోక్షము నీవె సుఖంబునీవె యీ
సాదము నీవె పుణ్యమును సన్మతి వీవె యశంబు నీవె స
ద్వాదము నీవె ధాన్యమును దానము నీవె వృషాచలేశ్వరా 69

ఉ. దాతవు నీవె జీవనముత్రాతయు నీవె సమస్తబాంధవ
వ్రాతము నీవె రిక్థమును బాతకహర్తవు నీవె శుద్ధవి
ఖ్యాతియు నీవె గౌరవము కౌతుకమీవెశుభంబుమాతయున్
ధాతవు నీవె జీవులకు నాగకులేశ మహీధ్రనాయకా! 70

Scanned with CamScanner

ఉ. ఆద్యుఁడ వీవె యీజగతికాగమవంద్యుఁడ వీవెదేవసం
పాద్యధనంబ వీవె నిరవద్యగుణుండవు నీవె జన్మరు
గ్వైద్యుఁడ వీవె భక్తజనకల్పక మీవె మునీంద్రకోటికిన్
వేద్యుఁడవీవె కావె హరి వేంకటనామ శిలోచ్చయాధిపా 71

సీ. వందనంబులు నీకు వందారుమందార
చిన్న పూలఖిలేశ! శేషశయన!
యంజలిబంధంబు లరవిందసమనేత్ర!
దండముల్ చక్రాబ్జధారి! నీకు
వేల ప్రణామముల్ విశ్వమోహనరూప!
జేజేలు ఖగరాజవాజి! నీకు
శతనమోవాకముల్ జలదాభమృదుదేహ!
యర్చనబృందంబు లసురవైరి!

తే. ప్రణతికోటులు నీ కివే పరమపురుష!
సేవలమితంబు లివె నీకు చిన్మయాత్మ!
భక్తి సేవింతు నిన్నెప్డు పద్మనాభ!
దందశూకధరేశ! పద్మాహృదీశ! 72

సీ. పతితపావననామ! పాలితసురధామ!
వక్త్రనిర్జితసోమ! ప్రధనభీమ!
వామానివహకామ! వర్షాంబుదశ్యామ!
వరకృపాసీమ! యాసురవిరామ!
యింద్రారిజలపాత హిమధామరక్షితా
శ్రిత జనస్తోమ! నిస్సీమధామ!
యగణితసుగుణ మహారామ! ధృతరమా
భామ! దుష్కృత తమోధామధామ!

Scanned with CamScanner

తే. సర్వలోక శరణ్య! యో సత్యకామ!
దాసజనకల్ప! పరమేశ ధర్మనిలయ!
విశ్వమోహనసద్రూప! విహగవాహ!
దండశూకధరేశ! పద్మావతీశ! 73

మత్తకోకిల :

వేంకటాచలనాథ! శ్రీవర! వేదవేద్యజనావనా!
పంకజాననవంద్య! మాధవ! పాపతూలహుతాశనా!
న్యంకుహృత్సరసీజ భాస్కర! నవ్యసారసలోచనా!
సంకటంబులఁబాపి రక్షణసల్పవే ఖగవాహనా! 74

ఉత్సాహ :

దాసదేవభూజ! శ్రీశ! దైత్యసంఘమర్దనా!
భాసమానభర్మచేల! భాగ్యముక్తిదాయకా!
వాసవాదిదేవవంద్య! పాదపద్మవేంకటా
వాస! నీకు సాటిలేరు ఫణ్నగాద్రినాయకా! 75

Scanned with CamScanner

శ్రీ పద్యాల వేంకటేశ్వర్లు గారి
ధర్మపత్ని శ్రీమతి పద్యాల రామలు మాణిక్యమ్మ
గారి గ్రంథం.

22-5-2012

(Padyala. Maithilinatha Prasad &
Padyala. Urmila Manasa Rayaku)
(S/o P. Padmamandira &
P. Devaraja Perumallu)
11/07/2012)

Scanned with CamScanner



Scanned with CamScanner

Scanned with CamScanner

కీ.శే.పద్యాల కుటుంబయ్య-బసవపున్నమ్మ
దంపతులు

Scanned with CamScanner

భాష్యకార సమాజ స్థాపకులు
మహర్షి శ్రీ వేంకటదాసస్వామి గారు

Scanned with CamScanner



తర్కవేదాంత విశారద

పండిత శ్రీ మొవ్వ శ్రీనివాసపెరుమాళ్ళుగారు

శ్రీరమా చిత్రశాల

Scanned with CamScanner

Scanned with CamScanner

శ్రీవేణుగోపాల సేవాశ్రమాధిపతులు, తర్కవేదాంత "కవిభట్టారక"
శ్రీ మొవ్వ దాశరధి సూరి "విష్ణుదాసు" గారు.

గుడివాడ. ది. 30-8-1998

Scanned with CamScanner

Scanned with CamScanner

Scanned with CamScanner

Scanned with CamScanner

Scanned with CamScanner



Scanned with CamScanner

Scanned with CamScanner

Scanned with CamScanner

Scanned with CamScanner
Scanned with CamScanner



1965–4–11 తేదీ కృష్ణాజిల్లా మోదుమూడి గ్రామములో గ్రంథకర్త వారి [illegible] జరిగిన గజారోహణ సన్మానం

Scanned with CamScanner
Scanned with CamScanner

Scanned with CamScanner

Scanned with CamScanner